TGTEL/25/A3603

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

PUBLISHED FROM HYDERABAD AND VIJAYAWADA

హైదరాబాద్ సంపుటి: 01 సంచిక : 208 శనివారం, జూన్ 13, 2026 పేజీలు :8 వెల.1/-

ఆరోగ్యవంతమైన మెడ్చల్ కోసం నమ్మకమైన వైద్య నిపుణులు
అత్యుత్తమమైన సేవలు,
ప్రతి అడుగులో మరింత శ్రద్ధ.
జైత్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్
మా ప్రత్యేకతలు
• అత్యవసర & క్రిటికల్ కేర్
• ప్రమాద సేవలు
• ప్రసూతి & గైనకాలజీ
• ఆర్థోపెడిక్స్
• జాయింట్ రీప్లేస్‌మెంట్స్
• జనరల్ మెడిసిన్
• జనరల్ సర్జరీ
• మ్యాక్సిలో ఫేషియల్ సర్జరీ
• పిల్లల వైద్యం & శిశు సంరక్షణ
• న్యూరాలజీ • న్యూరోసర్జరీ
• ప్లాస్టిక్ సర్జరీ • పల్మనాలజీ
• యూరాలజీ • డెర్మటాలజీ
• సైకియాట్రీ • ఫిజియోథెరపీ




నమ్మకమైన వైద్యం | నైతిక వైద్య సేవలు | చికిత్సే ముందుగా | నిపుణుల క్లినికల్ సంరక్షణ
అన్ని ఇన్సూరెన్స్ క్యాష్‌లెస్ సౌకర్యం | 24/7 అత్యవసర సేవలు | అత్యాధునిక అంబులెన్స్
+91 85230 89599 +91 86889 09384
www.jaitrahospitals.com • ITI పక్కన, NH 44, చంద్ర నగర్, మెడ్చల్, తెలంగాణ - 501401.

# అతి త్వరలో యథావిధిగా సింగరేణి మెడికల్ బోర్డు

సింగరేణి కార్మికులకు శుభవార్త. సింగరేణిలో వివిధ కారణాలతో కొద్ది కాలంగా నిలిచిపోయిన మెడికల్ బోర్డును అతి త్వరలో ప్రారంభించాల్సిందిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మెడికల్ బోర్డు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, వివాదరహితంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు.

సింగరేణి అభివృద్ధిపై ఇటీవల కోల్ బెల్ట్ ప్రాంత శాసన సభ్యులు, మంత్రులతో నిర్వహించిన సమావేశం సందర్భంగా మెడికల్ బోర్డు అంశాన్ని వారు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ అంశంపై కార్మికుల ఆందోళనలను వివరించారని చెప్పారు. ఆ సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి, కార్మికుల ప్రయోజనాలను కాపాడే దిశగా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

మెడికల్ బోర్డు ప్రక్రియ ద్వారా నిజంగా అర్హులైన ఉద్యోగులకు మాత్రమే ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వారి వారసులకు కారుణ్య నియామకాల రూపంలో ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు, మధ్యవర్తిత్వం లేదా మోసాలకు తావులేకుండా కట్టుదిట్టమైన వ్యవస్థను అమలు చేయాలని స్పష్టం చేశారు.

కార్మికుల సంక్షేమం విషయంలో ప్రజా ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని, మెడికల్ బోర్డు ప్రక్రియపై పూర్తి విశ్వాసం ఉంచి యాజమాన్యానికి సహకరించాలని కార్మికులకు సూచించారు.

ఇటీవల కాలం వరకు కారుణ్య నియామకాలు, డిపెండెంట్ ఉద్యోగాలకు అర్హత సాధించిన 335 మంది వారసులకు మంచిర్యాలలో శనివారం (ఈ నెల 13వ తేదీ)

జరిగే కార్యక్రమంలో ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలియజేశారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు.

సింగరేణిలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మారుపేర్ల అంశం తమ దృష్టిలో ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాన్ని పరిష్కరించేందుకు ఉన్న మార్గాలను అన్వేషిస్తున్నట్లు.. ఇందులో భాగంగానే ఈ అంశంపై న్యాయ పరమైన సలహా తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నిబంధనల మేరకు న్యాయ సలహా ప్రకారం సానుకూలంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



- మెడికల్ బోర్డును అత్యంత పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలి
- అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు చేపట్టాలి
- సింగరేణి యాజమాన్యానికి ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి
- భట్టి విక్రమార్క మల్లు ఆదేశం
- శనివారం (రేపు) మంచిర్యాలలో 335 మంది వారసులకు
- కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందజేయనున్నట్లు వెల్లడి

ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ సింగరేణి...

అలాగే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణి లో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణిలో 2,657 పోస్టులను భర్తీ చేశామన్నారు. వీటిలో 555 ఎక్సటర్నల్ పోస్టులు ఉండగా... 2,102 కారుణ్య నియామక ఉద్యోగాలను ఇవ్వడం జరిగిందన్నారు. ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీని కూడా ఆన్లైన్ పద్ధతిలో చేపట్టి వివాద రహితంగా అర్హులందరికీ ఉద్యోగాలు కల్పించామన్నారు.

కారుణ్య నియామకాల కోసం ఉన్న గరిష్ట వయోపరిమితిని 35 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలకు పెంచడం ద్వారా మరింత మంది అర్హులకు అవకాశం కల్పించామని తెలిపారు. ఇప్పటికే 200 మంది లబ్ధి పొందారని వెల్లడించారు.

దేశంలోనే తొలిసారిగా సింగరేణిలో పనిచేస్తున్న 40 వేల మంది ఉద్యోగులకు భరోసా కల్పించేలా రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. ఇదే కాకుండా బ్యాంకులతో సంప్రదింపులు జరిపి ఇటీవలే సింగరేణి ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ బీమా సదుపాయాన్ని కూడా కల్పించామన్నారు. అలాగే కాంట్రాక్టు కార్మికులకు కూడా 40 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామన్నారు.

ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా కార్మికులకు లాభాల వాటాను చెల్లించామని తెలియజేశారు. గత రెండేళ్లలో రూ.1500 కోట్లను లాభాల వాటా రూపేనా చెల్లించినట్లు వెల్లడించారు.

గతంలో ఎప్పుడూ లేని విధంగా సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా బోనస్సు చెల్లిస్తున్నామని, 2023-24లో ఒక్కొక్కరికీ రూ.5,000 చొప్పున, 2024-25లో రూ.5,500 చొప్పున లాభాల బోనస్సు పంపిణీ చేసినట్లు తెలిపారు.

సింగరేణిలో ప్రతీ ఉద్యోగికి అత్యాధునిక వైద్య సేవలు అందించే లక్ష్యంతో అన్ని ఏరియా ఆసుపత్రుల ఆధునికీకరణ చేసేలా చర్యలు తీసుకోవడమే కాకుండా గోదావరిఖని లో క్యాథ్ ల్యాబ్ను ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులు, వారి తల్లిదండ్రులు, డిపెండెంట్ పిల్లల వైద్య సేవల కోసం ఏటా రూ.300 కోట్లకు పైగా వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు.

తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా సింగరేణి కార్మికుల కష్టాలు, సమస్యలను ప్రత్యక్షంగా చూసినట్లు పేర్కొన్నారు. అందువల్ల సింగరేణి కార్మికుల పట్ల తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, వారి సంక్షేమం, ఉద్యోగ భద్రత మరియు వారి కుటుంబాల భవిష్యత్తు కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు.

రాబోయే రోజుల్లో కూడా సింగరేణిని బహుముఖంగా విస్తరించేందుకు, కొత్త బొగ్గు బ్లాక్లు సాధించేందుకు తద్వారా ఉద్యోగుల వారసులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతాయన్నారు. ఒడిశా నైనీ బ్లాక్ అనుమతులతోపాటు బొగ్గు ఉత్పత్తికి ప్రజా ప్రభుత్వంలో తీసుకున్న ప్రత్యేక చొరవను గుర్తుచేశారు.

రానున్న రోజుల్లో ఇతర రాష్ట్రాల్లోనూ సింగరేణిని విస్తరించే దిశగా తాము ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అయితే పోటీ మార్కెట్లో సింగరేణి నిలదొక్కుకోవాలంటే ఉత్పత్తి, ఉత్పాదకత పెరగాలని, ఇందుకోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు

## ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, భద్రత, ఆరోగ్యకరమైన వాతావరణం, సమాన అవకాశాలు అందాలి - సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సమాజంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనను ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

"బాల్యం ప్రతి చిన్నారి జన్మహక్కు. చదువుకోవడం, ఆడుకోవడం, ఆనందంగా ఎదగడం, తమ కలలను సాకారం చేసుకునే అవకాశాలు పొందడం ప్రతి పిల్లవాడి సహజ హక్కు. ఆ హక్కులను హరించే బాల కార్మిక వ్యవస్థకు సమాజంలో చోటు లేకుండా చేయడం మనందరి బాధ్యత" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, భద్రత, ఆరోగ్యకరమైన వాతావరణం, సమాన అవకాశాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అదే సమయంలో కుటుంబాలు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, సమాజంలోని ప్రతి పౌరుడు ఈ లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని కోరారు.

బాల కార్మిక వ్యవస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించకూడదని, ఎక్కడైనా చిన్నారులు పనుల్లో నిమగ్నమైనా, కనిపిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ఒక చిన్నారిని బాల కార్మికత్వం నుంచి బయటకు తీసుకురావడం అంటే అతనికి లేదా ఆమెకు ఒక కొత్త భవిష్యత్తును అందించినట్టేనని పేర్కొన్నారు.

"పిల్లల చేతుల్లో పనిముట్లు కాదు.. పుస్తకాలు ఉండాలి. వారి భుజాలపై



భారం కాదు.. భవిష్యత్తుపై ఆశలు ఉండాలి. ప్రతి చిన్నారి నవ్వుతూ, నేర్చుకుంటూ, కలలు కంటూ ఎదిగే తెలంగాణను నిర్మించడం మనందరి బాధ్యత" అని ముఖ్యమంత్రి ఒక సందేశంలో పేర్కొన్నారు.

## గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, జూన్ 12: తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం నాడు హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ 2026' సదస్సుకు మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లాజిస్టిక్స్ రంగంలో భవిష్యత్ అవకాశాలపై సదస్సు చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో కీలక రంగంగా లాజిస్టిక్స్‌ను ప్రభుత్వం గుర్తించిందన్నారు. లాజిస్టిక్స్ పాలసీ 2.0 ద్వారా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.తెలంగాణ వ్యాప్తంగా మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, డ్రై పోర్టుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. బాండెడ్ వేర్ హౌజింగ్ లాజిస్టిక్ పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఏఐ సైబర్ సెక్యూరిటీ మెషీన్ లెర్నింగ్ వినియోగానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. లాజిస్టిక్స్ రంగానికి అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను తయారు చేయడంపైనా ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు.

## రాజ్యసభకు ఖర్గే సహా 24 మంది ఎంపీలు ఏకగ్రీవంగా ఎన్నిక

న్యూఢిల్లీ: రాజ్యసభకు ఈనెల 18న ఎన్నికలు జరగాల్సి ఉండగా దీనికి ముందే పోటీ లేకుండా 24 మంది పెద్దల సభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, బీజేపీ జాతీయ కార్యదర్శి తరుణ్ చుగ్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉన్నారు. మొత్తం 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా వీటిలో 24 స్థానాలకు ఫలితాలు ప్రకటించారు. గెలుపొందిన అభ్యర్థులకు విన్నింగ్ సర్టిఫికేట్లను రిటర్నింగ్ అధికారులు అందజేశారు.రాజ్యసభలో ఎన్డీయే సంఖ్యాబలం 16 కాగా, తాజాగా మరో ముగ్గురు గెలవడంతో ఆ బలం 19కి చేరింది. కాంగ్రెస్ 5 సీట్లు గెలుచుకోగా, నాలుగు సీట్లు ఇంతకు ముందే ఆ పార్టీకి ఉన్నాయి. దీంతో రాజ్యసభలో కాంగ్రెస్‌కు ఒక సీటు మాత్రమే పెరిగింది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో 3 సీట్లు కోల్పోయింది. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బిజూ జనతాదళ్ సైతం తన సీట్లు బీజేపీకి కోల్పోయింది. బీజేపీ అభ్యర్థి దేబాశిష్ సమంతరాయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమంతరాయ్ మే 26న బీజేడీ రాజ్యసభ పదవి వదిలి బీజేపీలో చేరారు. తిరిగి బీజేపీ నుంచి రాజ్యసభ ఎంపీగా ఎన్నికయ్యారు.ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే నాలుగు సీట్లు గెలుచుకోగా, గుజరాత్‌లోని నాలుగు సీట్లను కూడా ఎన్డీయే ఎగరేసుకుపోయింది. అయితే కర్ణాటకలో కాంగ్రెస్ 3 సీట్లు గెలుచుకోగా, బీజేపీ ఒక సీటు దక్కించుకుంది. మధ్యప్రదేశ్‌లోని మొత్తం 3 సీట్లు, రాజస్థాన్‌లోని 3 సీట్లలో రెండు సీట్లు బీజేపీ గెలుచుకుంది. అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్‌లోని ఒక్కో స్థానాన్ని బీజేపీ దక్కించుకుంది. మేఘాలయలో ఎన్డీయే భాగస్వామి అయిన ఎన్‌పీపీ అక్కడి ఏకైక స్థానాన్ని గెలుచుకుంది. మహారాష్ట్ర, ఒడిశాలోనూ ఒక్కోసీటును ఎన్డీయే దక్కించుకోగా, తమిళనాడులోని ఏకైక స్థానాన్ని కాంగ్రెస్ గెలుచుకుంది.

ఏకగ్రీవంగా ఎన్నికైన రాజ్యసభ ఎంపీలు వీరే

ఆంధ్రప్రదేశ్:భాష్యం రామకృష్ణ (టీడీపీ), చింతకాయల విజయ్ (టీడీపీ), సాన సతీష్ బాబు (టీడీపీ), లింగమనేని రమేష్ (జనసేన)గుజరాత్:రాజూబాయ్ శుక్లా, మాన్‌సిన్హ్ పర్మార్, ముఖేష్ భాయ్ రథ్వా, జితేంద్ర కంజారియా (ముగ్గురూ బీజేపీ).కర్ణాటక:మల్లికార్జున్ ఖర్గే, మన్సూర్ అలీఖాన్, పవన్ ఖేరా (ముగ్గురూ కాంగ్రెస్), ఎం.నాగరజ (బీజేపీ).మధ్యప్రదేశ్:తరుణ్ చుగ్, రజనీశ్ అగర్వాల్, మహేశ్ కేవట్ (ముగ్గురూ బీజేపీ).రాజస్థాన్‌సతీష్ పూనియా (బీజేపీ), ఆల్కా గుర్జర్ (బీజేపీ), నీ రజ్ డాంగి (కాంగ్రెస్)అరుణాచల్ ప్రదేశ్:తై తగాక్ (బీజేపీ)మేఘాలయ:జేమ్ కె సంగ్మా (ఎన్‌పీపీ)మణిపూర్:అధికారిమయూమ్ శారదా దేవి (బీజేపీ)తమిళనాడు:ప్రవీణ్ చక్రవర్తి (కాంగ్రెస్)మహారాష్ట్ర:రాజేంద్ర జైన్ (ఎన్‌సీపీ)ఒడిశా:దేబశీష్ సమంతరాయ్ (బీజేపీ)ఇక జార్ఖాండ్, మిజోరంపైనే అందరి దృష్టికాగా, ఇప్పుడు అందరి దృష్టి జార్ఖాండ్, మిజోరం రాజ్యసభ ఎన్నికలపైనే ఉంది. జార్ఖాండ్‌లో రెండు రాజ్యసభ సీట్లు ఉండగా, ముగ్గురు పోటీలో ఉన్నారు. జార్ఖాండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) నేత బైద్యనాథ్ రామ్, కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రణవ్ ఝా, స్వతంత్ర అభ్యర్థి పరిమళ్ నాథ్వాని పోటీ చేస్తున్నారు. జార్ఖాండ్‌లో ఇండియా కూటమికి 56 మంది ఎమ్మెల్యేలు ఉండగా, ఒక్కో సీటు గెలుపొందడానికి 28 మంది ఎమ్మెల్యేల సంఖ్యా బలం కావాలి. ఎన్డీయేకు 24 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. జేఎల్‌కేఎంకు ఒక ఎమ్మెల్యే ఉన్నారు. మూడుసార్లు రాజ్యసభ ఎంపీగా ఉన్న నాథ్వాని గెలవాలంటే క్రాస్ ఓటింగ్ జరగాలి. మరోవైపు, మిజోరంలో ఒక రాజ్యసభ సీటు ఉండగా, జడ్‌పీఎం ప్రతినిధి కె.లామ్‌ట్‌లాంగ్ కిమా, ఎంఎన్‌ఎఫ్ నేత జోథాన్‌సంగి హ్మార్ ఎన్నికల బరిలో ఉన్నారు. 40 మంది సభ్యుల మిజోరం అసెంబ్లీలో జడ్‌పీఎంకు 27 మంది, ఎంఎన్‌ఎఫ్‌కు 10 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. బీజేపీకి ఇద్దరు, కాంగ్రెస్‌కు ఒక ఎమ్మెల్యే ఉన్నారు.

### ప్ర రా బి నేటిమాట..

చదువు విలువ తెలియని వాడి చేతిలో పుస్తకాన్ని మనసు లేని వాడి చేతిలో జీవితాన్ని ఉంచకూడదు

ఎందుకంటే ఇద్దరూ వాటితో ఆడుకుంటారే కాని వాటిని గౌరవించారు.

మనిషికి అసూయ ఎక్కువైతే ఆనందం దూరమవుతుంది. అహంకారం ఎక్కువైతే అందరూ దూరం అవుతారు

- ప్రమీల రాణి బి

# సంపాదకీయం

శనివారం, జూన్ 13, 2026

## ప్రమాదకరంగా మారుతున్న ఫెర్టిలిటీ రేటు

ఇటీవల ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ భారత్‌పై మరోసారి దృష్టి సారించారు. భారత్‌లో జనన రేటు రీప్లేస్‌మెంట్ లెవల్ కంటే తగ్గిపోయింది. చదువుకున్న, అత్యంత విద్యావంతులైన వర్గాల్లో ఇది చాలా సంవత్సరాలుగా జరుగుతోంది అని హెచ్చరించారు. 2024లో విడుదలైన లేటెస్ట్ సాంపుల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్) నివేదిక ప్రకారం భారతదేశ టోటల్ ఫర్టిలిటీ రేటు (టీఎఫ్ఆర్) 1.9కి పడిపోయింది. ఇది జనాభా స్థిరత్వానికి అవసరమైన 2.1 కంటే స్పష్టంగా తక్కువ.నాలుగైదు దశాబ్దాల క్రితం జనాభా గణనీయంగా పెరిగింది. "జనాభా బాంబు" అని ప్రపంచం భయపడిన భారత్ ఇప్పుడు జనాభా తగ్గుదల వైపు వేగంగా పయనిస్తోంది. ఇది మన సమాజం, ఆర్థిక వ్యవస్థ, భవిష్యత్ రూపురేఖలను పూర్తిగా మార్చగల ఒక మహత్తరమైన మలుపు. 1950?60లలో భారత్ ఫర్టిలిటీ రేటు 5.5 నుంచి 6 వరకు ఉండేది. అధిక మరణాల రేటు, వైద్య సదుపాయాల కొరత, వ్యవసాయ ఆధారిత జీవనం, ఉమ్మడి కుటుంబాలు, కుమారుడు సంతానం కోసం అనవసరమైన గర్భాలు ఇవన్నీ పెద్ద కుటుంబాలకు దోహదపడ్డాయి. పిల్లలు కుటుంబానికి శ్రమ బలం మాత్రమే కాకుండా, వృద్ధాప్యంలో భరోసా అని భావించారు. కానీ 1990ల నుంచి సమాజం వేగంగా మారింది. మహిళల విద్య, ఉద్యోగ అవకాశాలు, నగరీకరణ, పిల్లల పెంపకం ఖర్చులు (చదువు, ఆరోగ్యం, హౌసింగ్) ఇవన్నీ చిన్న కుటుంబాల వైపు మనస్తత్వాన్ని మార్చాయి. "ఒక్కడు/ఒక్కతే చాలు" అన్న భావన సామాన్యమైంది. ఫలితంగా 2024లో టీఎఫ్ఆర్ 1.9కు పడిపోయింది.ఇక్కడే మనకు అసలు సవాలు కనిపిస్తుంది. దక్షిణాది మరియు పశ్చిమ రాష్ట్రాల్లో ఫర్టిలిటీ రేటు ఇప్పటికే చాలా తక్కువగా ఉంది (తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లు 1.4?1.7 మధ్య ఉండగా, ఢిల్లీ వంటి నగరాలు 1.2 వరకు పడిపోయాయి. అయితే బీహార్ (2.9), ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ వంటి ఆరు రాష్ట్రాలు మాత్రమే ఇంకా రీప్లేస్‌మెంట్ లెవల్‌పై ఉన్నాయి. ఈ ప్రాంతీయ అసమానత భవిష్యత్తులో రాజకీయ, ఆర్థిక, సామాజిక ఉద్రిక్తతలకు దారితీయవచ్చు.చైనా తన "ఒక్క పిల్లవాడు" విధానంతో యువ జనాభాను తగ్గించుకుంది. ఇప్పుడు అక్కడ వృద్ధుల సంఖ్య భారీగా పెరిగి, శ్రమ శక్తి తగ్గి, ఆర్థిక వ్యవస్థపై భారం పడుతోంది. జపాన్, దక్షిణ కొరియా, రష్యా వంటి దేశాలు ఇప్పటికే ఈ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. భారత్ కూడా అదే మార్గంలో నడుస్తుందని మస్క్ హెచ్చరిక. మన దేశంలో డెమోగ్రాఫిక్ డివిడెండ్ అన్న ఆశలు ఇక త్వరలో ముగియవచ్చు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడం, ఉద్యోగుల కొరత, పెన్షన్, ఆరోగ్య సంరక్షణ ఖర్చులు పెరగడం, ఒక తరం మరొక తరానికి సహాయం చేసే సామాజిక చక్రం దెబ్బతినడం ఇవన్నీ రాబోయే దశాబ్దాల్లో మన ముందు నిలబడతాయి. అయినా ఇది పూర్తి విపత్తు కాదు. ఈ తగ్గుదలను పూర్తిగా ప్రమాదంగా చూడకూడదు. ఇది మహిళల సాధికారత, విద్య, ఆర్థిక అభివృద్ధి, కుటుంబ నియంత్రణ అవగాహన వంటి సానుకూల మార్పుల ఫలితం. పిల్లల సంఖ్య తగ్గడం వల్ల ప్రతి పిల్లవాడికి మంచి పోషణ, విద్య, ఆరోగ్యం ఇవ్వడం సాధ్యపడుతోంది. గుణాత్మక జనాభా అన్న లక్ష్యం సాధ్యమవుతోంది.భారత్ ఇప్పుడు ఒక చారిత్రక మలుపు వద్ద నిలబడి ఉంది. జనాభా పెరుగుదల సమస్య నుంచి జనాభా తగ్గుదల సవాలు వైపు మారుతోంది. ఇది భయపడాల్సిన విషయం కాదు, కానీ నిర్లక్ష్యం చేయాల్సిన విషయం కూడా కాదు. సమయం ఉంది.ఫెర్టిలిటీ క్లినిక్‌ల సమాచారం ప్రకారం, ఎగ్ ఫ్రీజింగ్‌లో కీలకమైన 'ఎగ్ రిట్రీవల్ సైకిల్' ప్రక్రియకు క్లినిక్‌ను బట్టి రూ.1.2 లక్షల నుంచి రూ.3.2 లక్షల వరకు ఖర్చవుతోంది. అనంతరం అండాలను భద్రపరచడానికి ప్రతి ఏడాది రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. ఖర్చు ఎక్కువైనా భవిష్యత్తులో తల్లితనాన్ని కోల్పోకూడదనే ఉద్దేశంతో మహిళలు ఈ ప్రక్రియను ఎంచుకుంటున్నారు.వైద్యుల సూచనల ప్రకారం, 25 నుంచి 32 ఏళ్ల మధ్యలో ఎగ్ ఫ్రీజింగ్ చేయించుకోవడం ఉత్తమమని చెబుతున్నారు. 35 ఏళ్లు దాటిన తర్వాత అండాల నాణ్యత, సంఖ్య రెండూ తగ్గే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. హార్మోన్ ఇంజెక్షన్ల వల్ల కొందరిలో ఉబ్బరం, భావోద్వేగ మార్పులు, అరుదుగా అండాశయ హైపర్ స్టిమ్యులేషన్ సిండ్రోమ్ వంటి సమస్యలు రావచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే శస్త్రచికిత్స సమయంలో రక్తస్రావం, ఇన్ఫెక్షన్ల ముప్పు కూడా ఉంటుందని వెల్లడించారు.అయితే ఆధునిక విట్రిఫికేషన్ సాంకేతికత వల్ల అండాలను ఎక్కువకాలం నాణ్యత తగ్గకుండా భద్రపరచడం సాధ్యమవుతోందని వైద్యులు తెలిపారు. 25-32 ఏళ్ల మధ్య వయసులో నిల్వ చేసిన అండాలతో భవిష్యత్తులో గర్భధారణ విజయశాతం 60 నుంచి 80 శాతం వరకు ఉండొచ్చని పేర్కొన్నారు. మహిళల వయసు, అండాల నాణ్యత, శీతలీకరణ పద్ధతులు వంటి అంశాలపై ఈ విజయశాతం ఆధారపడి ఉంటుందని వివరించారు.క్యాన్సర్ వంటి వ్యాధులతో బాధపడే మహిళలు చికిత్స ప్రారంభానికి ముందే తమ అండాలను ఫ్రీజ్ చేయించుకుంటున్నారని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే కీమోథెరపీ, రేడియేషన్ వంటి చికిత్సల వల్ల సంతానోత్పత్తి సామర్థ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. మరోవైపు ఉద్యోగాలు చేసే యువతులు పెళ్లికి ముందే ఫెర్టిలిటీ నిపుణులను సంప్రదించి అండాల నిల్వపై అవగాహన పెంచుకుంటుండటం ప్రస్తుతం నగరాల్లో కొత్త ధోరణిగా మారుతో సరైన విధానాలు, సమగ్ర ఆలోచన, సమతుల్య దృక్పథంతో ఈ మార్పును అవకాశంగా మలచుకోగలిగితే మన భవిష్యత్ తరాలు మన్నించే దేశంగా మారవచ్చు. లేకపోతే, చైనా, జపాన్ మాదిరిగా ఆలస్యంగా బాధపడే దేశంగా మిగిలిపోవచ్చు. సమయం మన చేతిలో ఉంది. ఆలోచనలు మార్చుకునే సమయం ఇదే. **- ఎడిటర్**

# వానొస్తే...ఇంతేనా



### హైడ్రా, గ్రేటర్ మధ్య సమన్వయ లోపం

హైదరాబాద్. జూన్ 12, (న్యూస్ పల్స్)భాగ్యనగరంలో వానాకాలం ముంచుకొస్తున్న తరుణంలో బల్దియా యంత్రాంగం, హైడ్రా చేసిన ముందస్తు ఏర్పాట్లలోని లోపాలు తొలి వర్షానికే పూర్తిగా బయటపడ్డాయి. వర్షాలొస్తున్నాయంటూ వివిధ ప్రభుత్వ శాఖలతో వరుస సమన్వయ సమావేశాలు నిర్వహించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. క్షేత్రస్థాయిలో జరగాల్సిన సన్నద్ధతపై మాత్రం దృష్టి సారించలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వానాకాలం మొదలయ్యాక అత్యవసర బృందాలు, ఇతర యంత్రాంగం ఏర్పాటుకు టెండర్లు పిలవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. మరోవైపు, హైడ్రా హడావుడి చూసి అంతా ఆ సంస్థే చూసుకుంటుందనే భావనతో నగరంలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్లు చేతులెత్తేయడంతో సమన్వయ లోపం స్పష్టంగా కనిపించింది. దీని ఫలితంగా మంగళవారం కురిసిన వర్షానికి నగరవ్యాప్తంగా సుమారు మూడు లక్షల మంది వాహనదారులు అర్ధరాత్రి వరకు రోడ్లపైనే నరకయాతన అనుభవించారు.నగరంలో రోడ్లపై వరద నీరు నిలవకుండా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన వరద నాలాల నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోవడం, నాలాల పూడికతీత పనులు సరిగా జరగకపోవడం ఈ ముంపునకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. దీనికి తోడు ముంపు సమస్యను తక్షణమే సరిదిద్దే అత్యవసర బృందాలను సకాలంలో ఏర్పాటు చేయకపోవడం పరిస్థితిని మరింత తీవ్రం చేసింది. మే నెల ప్రారంభం నుండే హైడ్రా ఆధ్వర్యంలో వర్షకాల సన్నద్ధతపై సమావేశాలు నిర్వహించి, అధికారులకు సూచనలు చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం ఆశించినట్లుగా లేదని ఈ ఒక్క వర్షంతో తేలిపోయింది.హైటెక్స్ సమీపంలోని జూబ్లీగార్డెన్ రోడ్డు నంబర్ 8 లో గతంలో భారీ వర్షం కురిస్తే 20 నిమిషాల పాటు వరద నీరు నిలిచేది. కానీ జూన్ 9న కురిసిన వర్షానికి ఇక్కడి కాలనీలు ఏకంగా నాలుగు గంటల పాటు వరద నీటిలో చిక్కుకుపోయాయి. రోడ్లపై నడుముల్లోతు నీరు చేరడంతో కార్లు, ఇతర వాహనాలు పూర్తిగా మునిగిపోయాయి. ఈ ప్రాంతంలో మీనాక్షి టవర్స్, వాసవి టవర్స్ వంటి భారీ బహుళ అంతస్తుల ప్రాజెక్టులు నిర్మించడంతో సహజ వరద నీటి ప్రవాహ మార్గాలన్నీ మూసుకుపోయాయి. వరద నాలాల సామర్థ్యం ప్రవాహ మార్గాల గురించి ఆలోచించకుండా ఉన్నతాధికారులు నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం, ఇంజనీరింగ్ లోపాలతో రోడ్లు వేయడమే ఈ దుస్థితికి కారణమని స్థానికులు మండిపడుతున్నారు. అర్ధరాత్రి వరకు రోడ్లపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయినా, సహాయం చేయడానికి క్షేత్రస్థాయిలో అధికారులు ఎవరూ కనిపించకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.కొన్ని గంటల క్రితం కురిసిన ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బల్దియా పరిధిలోని విద్యుత్ సరఫరా వ్యవస్థను దెబ్బతీసింది. విద్యుత్ ప్రధాన కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఉన్న కాలనీలు సైతం 24 గంటలకు పైగా కరెంట్ లేక నరకయాతన పడ్డాయి. విపత్తులు తలెత్తినప్పుడు అన్ని విభాగాలు కలిసి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ, హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్‌లోని సైఫాబాద్, ఆజామాబాద్ డివిజన్లలో అధికారుల తీవ్ర జాప్యం వల్ల వినియోగదారులు కరెంట్ లేక నానాపాట్లు పడ్డారు.

ముషీరాబాద్, హిమాయత్‌నగర్, నారాయణగూడ ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వానకు పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. చెట్లు విరిగిపడటంతో ఇనుప విద్యుత్ స్తంభాలు వంగిపోయి, లైన్లు తెగిపడటంతో సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. హైడ్రా, జీహెచ్ఎంసీ అత్యవసర సిబ్బంది రోడ్లపై పడిన చెట్లను వెంటనే తొలగించినప్పటికీ, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో అధికారులు తీవ్ర అలసత్వం ప్రదర్శించారని స్థానికులు ఆరోపిస్తున్నారు.గాంధీనగర్, హెబ్రోన్ చర్చి వీధి, వై జంక్షన్, విద్యానగర్, ఎస్‌బీఐ బ్యాంక్ వీధి, సీపీఎం మార్క్స్ భవన్ రాష్ట్ర కార్యాలయం వీధి, అడిక్‌మెట్ డివిజన్ ఆశీర్వాద్ అపార్ట్‌మెంట్ వీధి ప్రాంతాల్లో 24 గంటలు గడిచినా సరఫరా పునరుద్ధరించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

జోన్ల వారీగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల వివరాలు:

హైదరాబాద్ సెంట్రల్: 56 స్తంభాలు

సికింద్రాబాద్: 11 స్తంభాలు

హైదరాబాద్ సౌత్: 10 స్తంభాలుసైబర్ సిటీ: 8 స్తంభాలు

ఐటీ ఉద్యోగులు, వ్యాపారుల ఇబ్బందులు

దీర్ఘకాలిక విద్యుత్ కోతల కారణంగా వర్క్ ఫ్రమ్ హోమ్ (ఇంటి నుంచి) పనిచేస్తున్న ఐటీ ఉద్యోగులు చార్జింగ్ లేక లాప్‌టాప్‌లు పనిచేయక, ఫోన్లు స్విచ్ ఆఫ్ అయి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు కేబుల్ వైర్లు తెగిపోవడంతో ఇంటర్నెట్ సేవలు కూడా పూర్తిగా నిలిచిపోయాయి. విద్యానగర్, గాంధీనగర్, అడిక్‌మెట్ ప్రాంతాల్లోని 50కి పైగా అపార్ట్‌మెంట్లు, 100కు పైగా ఇండ్లలో కరెంట్ కష్టాలు తలెత్తడంతో వ్యాపారులు అద్దెకు జనరేటర్లను తెచ్చుకుని వ్యాపారాలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అపార్ట్‌మెంట్లలో లిఫ్టులు పనిచేయకపోవడంతో వృద్ధులు నానాయాతన పడ్డారు. కరెంట్ లేకపోవడంతో మోటార్లు నడవక ట్యాంకుల్లో నీరు అయిపోయి, తాగునీటితో పాటు కనీస అవసరాలకు తీవ్ర కొరత ఏర్పడింది.

# అటు కేసీఆర్... ఇటు కేటీఆర్...

మెదక్, జూన్ 12, (న్యూస్ పల్స్)తెలంగాణ రాజకీయాలు అత్యంత ఆసక్తికరంగా సాగుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఓటమి తర్వాత కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న బీఆర్ఎస్ ఇప్పుడు మైండ్ బ్లోయింగ్ ప్లాన్‌తో పొలిటికల్ గ్రౌండ్‌లోకి దూకేందుకు సిద్ధమైంది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇద్దరూ ఒకేసారి క్షేత్రస్థాయిలోకి రాబోతుండటం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. తండ్రీకొడుకులు ఇద్దరూ ఒకే వ్యూహంతో, కానీ భిన్న రూపాల్లో ప్రజల ముందుకు



రావడం ఇప్పుడు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతోంది.ఎన్నికల ఫలితాల తర్వాత కేసీఆర్ ఎక్కువగా ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారంటూ ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న విమర్శలకు గట్టి కౌంటర్ ఇచ్చేందుకు గులాబీ బాస్ రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నారు. తెలంగాణవ్యాప్తంగా భారీ బస్సు యాత్రకు కేసీఆర్ శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ యాత్ర ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాలను కవర్ చేస్తూ, నేరుగా ప్రజలతో మమేకం కావాలని ఆయన భావిస్తున్నారు. క్షేత్రస్థాయిలో కేడర్‌లో మళ్లీ మునుపటి జోష్ నింపడం, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే లక్ష్యంగా ఈ యాత్ర సాగనుంది. ప్రస్తుతం పార్టీ ముఖ్య నేతలు ఈ బస్సు యాత్రకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను ఫైనలైజ్ చేసే పనిలో నిమగ్నమయ్యారు.మరోవైపు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సరికొత్త పంథాను ఎంచుకున్నారు. తండ్రి బస్సు యాత్ర చేస్తుంటే, కొడుకు సుదీర్ఘ పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. యువతను, సామాన్య ప్రజలను ఆకట్టుకునేలా సుదీర్ఘ కాలం పాటు ఈ పాదయాత్ర సాగనుంది. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ, జనాన్ని పలకరిస్తూ సాగనున్న ఈ యాత్ర పార్టీకి కొత్త ఊపిరి పోస్తుందని బీఆర్ఎస్ శ్రేణులు గట్టి నమ్మకంతో ఉన్నాయి. తండ్రి బస్సుపై ఉంటూ.. కొడుకు నడుస్తూ జనాన్ని పలకరించే ఈ డ్యూయల్ స్ట్రాటజీ తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.ప్రస్తుతం తెలంగాణలో పొలిటికల్ సినారియో పూర్తిగా మారిపోయింది. ఓ వైపు అధికార కాంగ్రెస్, మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. రెండు పార్టీలు బీఆర్ఎస్‌ను తీవ్రంగా కార్నర్ చేశాయి. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా, మున్ముందు ఆ పార్టీని మూడో స్థానంలోకి నెట్టేయాలని ఉమ్మడిగా గట్టి వ్యూహాలు రచిస్తున్నాయి.ఇలాంటి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో తామేంటో, తమ సత్తా ఏంటో చాటాల్సిన అగ్నిపరీక్ష బీఆర్ఎస్‌కు ఎదురైంది. పార్టీని మళ్లీ పూర్వ వైభవానికి తీసుకురావాలంటే జనంలోకి వెళ్లడం మినహా మరో మార్గం లేదని గులాబీ అధిష్ఠానం భావించింది. అందుకే ఇంతకాలం లో-ప్రొఫైల్ మెయింటైన్ చేసిన కేసీఆర్, కేటీఆర్ ఇద్దరూ ఒకేసారి రోడ్లపైకి వస్తున్నారు.బీఆర్ఎస్ శ్రేణుల్లో ఈ వార్త కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ రెండు యాత్రల పూర్తి షెడ్యూల్, అధికారిక రూట్ మ్యాప్స్ త్వరలోనే విడుదల కానున్నాయి. మరి తండ్రీ కుమారుల స్ట్రాటజీ బీఆర్ఎస్‌ను మళ్లీ రేసులోకి తెస్తుందా? కాంగ్రెస్, బీజేపీల ముకుమ్మడి దాడిని తట్టుకుని గులాబీ పార్టీ పూర్వ వైభవాన్ని సాధిస్తుందా? అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

# పోలీసులకు రికవర్రీ...

కరీంనగర్, జూన్ 12, (న్యూస్ పల్స్)కరీంనగర్ జ్యోతినగర్‌లోని ప్రముఖ పీఎంజే జ్యువెలరీ షోరూమ్‌పై జరిగిన భారీ దోపిడీ కేసు పోలీసులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఘటన జరిగి దాదాపు 40 రోజులు అయినా చోరీ అయిన వజ్రాలు, బంగారు ఆభరణాల ఆచూకీ ఇప్పటికీ పూర్తిగా లభ్యం కాలేదు. సాధారణ దోపిడీ కేసుల్లో కొద్ది రోజుల్లోనే సొత్తు రికవరీ అయ్యేవి, కానీ ఈ కేసు పూర్తి వ్యతిరేక దిశలో సాగుతోంది.ఈ దోపిడీ కేసులో కీలక నిందితుడిగా పోలీసులు గ్యాంగ్‌స్టర్ సుబ్యోద్‌సింగ్ అని గుర్తించారు. ఇటీవలే అతడిని అరెస్టు చేసి కరీంనగర్‌కు తీసుకొచ్చారు. అతనితోపాటు ఇతర నిందితులు కూడా విచారణలో పరస్పరం విరుద్ధమైన వాదనలు చెబుతున్నారు. ఒకరు ఒక విషయం చెప్పగా, మరొకరు దానికి పూర్తి వ్యతిరేకంగా సమాధానాలు ఇవ్వడం పోలీసులను తీవ్ర గందరగోళంలో పడేస్తోంది. ఈ విరుద్ధ సమాధానాలు సహజమైనవా లేదా నిందితులు కావాలని పోలీసులను తప్పుదారి పట్టించడానికి చేస్తున్న వ్యూహాత్మక ప్రయత్నమా అనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. గ్యాంగ్‌స్టర్ నేతృత్వంలోని ఈ బృందం ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడానికి ముందుగానే సిద్ధమై ఉండవచ్చని పోలీసు వర్గాలు అనుమానిస్తున్నాయి.పీఎంజే కేసు దర్యాప్తు సాధారణ దొంగతనం కంటే చాలా క్లిష్టంగా మారింది. దోపిడీ జరిగిన వెంటనే సొత్తును వేర్వేరు చోట్లకు తరలించినట్లు పోలీసులు భావిస్తున్నారు.

## నీట్ పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

నిజామాబాద్, జూన్ 12: నీట్ పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు నిజామాబాద్ ఇంచార్జ్ పోలీస్ కమిషనర్ రాజేష్ చంద్ర జారీ చేశారు. రీ - ఎగ్జామినేషన్ ఆఫ్ నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ నీటి 2026పరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా గిరిరాజ్ గవర్నమెంట్ కాలేజీ ఆటోనోమౌస్ , నిజామాబాద్.యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ బిల్డింగ్ , డిచ్ పల్లి.యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ , డిచ్ పల్లి.గవర్నమెంట్ జూనియర్ కాలేజీ , బోధన్.గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ , బోధన్. గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్ , నిజామాబాద్. బిగాల



కృష్ణమూర్తి జడ్.పి. హెచ్.ఎస్ మాక్లూర్.తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ ఆఫ్ జూనియర్ కాలేజీ ఫర్ గర్ల్స్ నాగారం , నిజామాబాద్ యందు పరీక్ష కేంద్రాలు గలవు.పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కలదు.ఇట్టి ఎగ్జమినేషన్ సెంటర్ లవద్ద కట్టుదిట్టమైన భదత నిజామాబాద్ ఇంచార్జ్ పోలీస్ కమిషనర్ ( కామారెడ్డి జిల్లా ఎస్.పి ) ఎం. రాజేష్ చంద్ర, నిషేధాజ్ఞలు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం పరీక్షా కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఇద్దరికి మించి గుంపులుగా చేరడం నిషేధం. పరీక్షల సమయంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు అన్ని పరీక్ష కేంద్రాలలోఈ నెల 21 న(ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు) సమీపంలోని ఇంటర్నెట్ సెంటర్లు , జిరాక్స్ షాపులు మరియు స్టేషనరీ దుకాణాలను తప్పనిసరిగా మూసివేయాలని సంబంధిత యజమానులకు సూచనలు జారీ చేసినట్లు తెలిపారు.పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో ప్రత్యేక బందోబస్త్ ఏర్పాటు చేయబడుతుందని , కేంద్రాల వద్ద అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచుతామని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు**

## రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్



నిజామాబాద్, జూన్ 12 : రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటిస్తే, ప్రమాదాలకు ఆస్కారం ఉండదని అన్నారు. ఈ దిశగా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉన్న మార్గాల ద్వారా చైతన్యపర్చేందుకు కృషి చేయాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. పోలీస్, నేషనల్ హైవే అథారిటీ, ఆర్ అండ్ బి, రవాణా శాఖ, ఆర్టీసీ, పంచాయతీ రాజ్, విద్యుత్, వైద్యారోగ్యం, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో పాటు రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న బ్లాక్ స్పాట్ ప్రాంతాల గురించి, ప్రమాదాలకు గల కారణాలపై సమావేశంలో చర్చించి పలు సూచనలు చేశారు. ప్రమాదాలను నిలువరించేందుకు ఆయా శాఖల వారీగా చేపట్టాల్సిన చర్యల గురించి అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులకు మార్గనిర్దేశం చేశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం లైన్ డిపార్ట్ మెంట్స్ కు చెందిన అధికారులు పరస్పర సమన్వయంతో, సమిష్టిగా కృషి చేయాలన్నారు. వరి కోతల సమయంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నట్లు గణాంకాల ద్వారా తెలుస్తోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని రోడ్లపై ధాన్యం ఆరబెట్టకుండా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. అతి వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించకపోవడం వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ విద్యార్థులకు, వాహన డ్రైవర్లకు, ప్రజలకు అవగాహన పెంపొందేలా విరివిగా ప్రచారం నిర్వహించాలని అన్నారు. బ్లాక్ స్పాట్లుగా గుర్తించబడిన ప్రదేశాలలో తక్షణ చర్యలు చేపట్టి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఎక్కడ ప్రమాదం జరిగినా, అందుకు గల కారణాలపై పూర్తిస్థాయిలో పరిశీలన జరపాలని, తద్వారా అలాంటి చోట్ల మరోమారు ప్రమాదాలు జరుగకుండా నియంత్రణ చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రమాదాలకు కారణం అవుతున్న ఆక్రమణలను సంబంధిత శాఖలు సమన్వయంతో తొలగించాలని సూచించారు. పీ.ఎం రహ్ వీర్, పీ.ఎం రాహత్ కార్యక్రమాల గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీఓ శ్రీనివాస్ రావు, డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ దుర్గా ప్రమీల, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, ఆర్ అండ్ బీ ఈ.ఈ అజ్మీర, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఎన్.ఐ.సీ అధికారి మధు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ భాస్కర్, ఈ-దార్ మేనేజర్ హర్ష, రెడ్ క్రాస్ ప్రతినిధి బుస్స ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లో ఇంటిదొంగలు

హైదరాబాద్, జూన్ 12, (న్యూస్ పల్స్)తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం ఒక ఆసక్తికరమైన, వ్యూహాత్మక మార్పు కనిపిస్తోంది. ప్రధాన ప్రతిపక్షం భారత్ రాష్ట్ర సమితి  విమర్శల బాణాలు ఎటువైపు వెళ్తున్నాయో గమనిస్తే ఒక స్పష్టమైన సంకేతం కనిపిస్తుంది. బీఆర్ఎస్ పార్టీ జాతీయ స్థాయిలో గానీ, రాష్ట్ర స్థాయిలో గానీ కాంగ్రెస్ పార్టీని ఒక వ్యవస్థగా పెద్దగా టార్గెట్ చేయడం లేదు. వారి ఏకైక లక్ష్యం, నిరంతర దాడి కేవలం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిపైనే కేంద్రీకృతమై ఉంది. తాజాగా కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురైన వివాదంలో కూడా బీఆర్ఎస్ నేతలు, రేవంత్ రెడ్డి వ్యతిరేక వర్గాలు దీనిని  రేవంత్ కుట్రే  అన్నట్లుగా ప్రొజెక్ట్ చేస్తుండటం ఈ వ్యూహానికి బలమైన నిదర్శనంగా నిలుస్తోంది.బీఆర్ఎస్ అధినాయకత్వానికి కాంగ్రెస్ భావజాలంపై కంటే రేవంత్ రెడ్డి శైలిపైనే ఎక్కువ అభ్యంతరాలు, భయాలు ఉన్నాయనేది బహిరంగ రహస్యం. రేవంత్ రెడ్డి పీసీసీ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి, ముఖ్యమంత్రి అయ్యాక కూడా బీఆర్ఎస్‌ను రాజకీయంగా కోలుకోలేని దెబ్బ తీయాలనే ఏకైక అజెండాతో దూకుడుగా ముందుకు వెళ్తున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల చేరికలు, కేసీఆర్ కుటుంబంపై విచారణలు, ఫోన్ ట్యాపింగ్ కేసు వంటి అంశాలతో గులాబీ దళాన్ని రేవంత్ రక్షణలో పడేశారు. అందుకే బీఆర్ఎస్ కూడా కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే కేడర్‌లో పెద్దగా మైలేజ్ రాదని, రేవంత్ రెడ్డిని పర్సనల్‌గా బలహీనపరిస్తేనే తమకు మళ్లీ పూర్వవైభవం వస్తుందని బలంగా నమ్ముతోంది. తమకు రాజకీయంగా అడ్డుగా నిలిచిన ఏకైక  పిల్లర్‌ను కూల్చడమే వారి ప్రధాన లక్ష్యంరాహుల్ గాంధీ కోటరీలో అత్యంత కీలకమైన, నిజాయితీ గల నాయకురాలిగా పేరున్న తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ సాంకేతిక కారణాల  వల్ల తిరస్కరణకు గురవడం కాంగ్రెస్‌లో పెద్ద కలకలం రేపింది. సీఎం రేవంత్ దీనిని 'బీజేపీ కుట్ర, సీట్ల చోరీ' అని ఢిల్లీ వేదికగా కొట్లాడుతుంటే, ప్రతిపక్షాలు , రేవంత్ అంతర్గత శత్రువులు మాత్రం దీని వెనుక రేవంత్ రెడ్డి హస్తం ఉందనే కోణాన్ని తెరపైకి తెస్తున్నారు. రాష్ట్రంలో తన పట్టుకు అడ్డుగా మారే అవకాశం ఉన్న ఢిల్లీ పెద్దలను, హైకమాండ్ ప్రతినిధులను రేవంత్ రెడ్డి కావాలనే ఇబ్బందుల్లో నెడుతున్నారనే ప్రచారాన్ని బీఆర్ఎస్ గట్టిగా సమాజంలోకి పంపుతోంది. ఈ స్నాగ్ ఇష్యూ ద్వారా రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద నమ్మకద్రోహిగా నిలబెట్టాలనేది బీఆర్ఎస్ అసలు ప్లాన్.బీఆర్ఎస్ ఆలోచనల వెనుక ఒక లోతైన రాజకీయ లెక్క ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంక్ ఉన్నప్పటికీ, ఆ పార్టీని నడిపించే 'ఇంజిన్' రేవంత్ రెడ్డే. ఆయన ఢిల్లీ హైకమాండ్ వద్ద బలహీనపడితే లేదా అధిష్ఠానం ఆయనపై నమ్మకం కోల్పోతే, తెలంగాణ కాంగ్రెస్‌లో ఉన్న పాత అసమ్మతి నేతలు మళ్లీ తలలేపుతారు. తద్వారా కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటలతో దానంతట అదే బలహీనపడుతుందని బీఆర్ఎస్ అంచనా వేస్తోంది.  రేవంత్ రెడ్డిని దెబ్బతీస్తే.. తెలంగాణలో కాంగ్రెస్ కోట కూలిపోతుంది అనే థియరీతోనే బీఆర్ఎస్ అడుగులు వేస్తోంది. అందుకే వారు జాతీయ కాంగ్రెస్‌ను కాకుండా, కేవలం రేవంత్ చుట్టూనే రాజకీయ చక్రవ్యూహాన్ని రచిస్తున్నారు.రేవంత్ రెడ్డికి ఉన్న అతిపెద్ద బలం రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీల వద్ద ఉన్న నమ్మకం. ఈ నమ్మకాన్ని చెడగొట్టడానికి బీఆర్ఎస్ నిరంతరం ప్రయత్నిస్తోంది. 'రేవంత్ రెడ్డి ఎప్పటికైనా కాంగ్రెస్‌కు ముప్పు', 'ఆయన తన సొంత ఎజెండాను అమలు చేస్తున్నారు', 'ఢిల్లీ పెద్దల నామినేషన్లు రద్దు కావడానికి ఆయనే కారణం' అనే నరేటివ్‌ను ఢిల్లీ స్థాయికి చేర్చడం ద్వారా రేవంత్ రెడ్డి పీఠాన్ని కదిలించవచ్చని బీఆర్ఎస్ భావిస్తోంది. సీఎంను ఒంటరిని చేయడం ద్వారా, రాష్ట్రంలో కాంగ్రెస్ దూకుడుకు బ్రేకులు వేయవచ్చని విపక్షం గట్టి వ్యూహాత్మక దాడి చేస్తోంది. ఎంత సక్సెస్ అవుతుందన్నది వేచి చూడాల్సిందే.

# 14న కాక్ రోచ్ పార్టీ నిరసన




హైదరాబాద్, జూన్ 12, (న్యూస్ పల్స్)దేశ రాజకీయాల్లో ' కాక్రోచ్ జనతా పార్టీ ' ఓ సంచలనం. ఓ కేసులో నిరుద్యోగ యువతను 'బొద్దింకలు', 'పరాన్న జీవులు'తో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పోల్చడంతో సీజేపీ ప్రారంభమైన సంగతి తెలిసిందే. ప్రకటన వెలువడిన గంటల వ్యవధిలోనే ప్రధాన రాజకీయ పార్టీలకు మించి ఫోలోవర్లు వచ్చారు. ఐదు రోజుల వ్యవధిలోనే రెండు కోట్ల మంది ఫాలోవర్లకు చేరుకున్నారు. దేశం ఎదుర్కొంటున్న సంక్షోభానికి యువతలో అసంతృప్తి ఎలా ఎగిసిపడుతుందనడానికి ఇదే ఓ మచ్చు తునక. నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంపై రాజధానిలో సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే నాయకత్వంలో మొదటిసారి ప్రత్యక్ష నిరసన చేపట్టారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు కోరుతూ దేశవ్యాప్త ఆందోళన చేపడతామని ఆ ధర్నాలోనే దీప్కే ప్రకటించారు. దక్షిణ భారతదేశంలో సీజేపీ తొలి నిరసన జూన్ 14న హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో చేపట్టనుంది. విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం, పరీక్షా విధానాలలో సంస్కరణలు కోరుతూ చేపట్టిన 'గోయింగ్ నేషనల్' ఉద్యమంలో ఈ ఆందోళనలు ఒక భాగమని సీజేపీ చెబుతోంది. సీజేపీ విడుదల చేసిన అధికారిక షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్‌లో నిరసన జూన్ 14న ఉదయం 10 గంటలకు ధర్నా చౌక్‌లో జరగనుంది. విద్యార్థి సంఘాలు, పౌర సమాజ సభ్యులు ఇందులో పాల్గొంటారని అంచనాతో శాంతియుత ప్రదర్శనకు పిలుపునిచ్చారు.అదే రోజున సాయంత్రం బెంగళూరులోని ఫ్రీడమ్ పార్కులో భారీ నిరసన జరుగుతుందని తెలిపింది. దక్షిణాదిన విస్తరణలో భాగంగా ఈ రెండు నిరసనలు చేపట్టినట్టు సీజేపీ పేర్కొంది. జూన్ 11న మహారాష్ట్రలోని పుణేలో నిరసన చేపట్టింది. జూన్ 12న ఉత్తర్ ప్రదేశ్ లక్నో (ఇకో గార్డెన్)లో, పంజాబ్‌లో జూన్ 13న అమృత్‌సర్‌లో, జూన్ 14 హైదరాబాద్, బెంగళూరు, జూన్ 15న రాజస్థాన్ రాజధాని జైపూర్, జూన్ 20 ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు నిర్వహిస్తామని వెల్లడించింది.ప్రశ్నపత్రాల లీకేజీ, ఫలితాల జాప్యం, నియామకాలు, ప్రవేశ పరీక్షలలో పారదర్శకత లోపించడం వంటి సమస్యలను పరిష్కరించడమే ఈ నిరసనల లక్ష్యమని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు. ఈ వ్యవస్థ దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేస్తోందని, అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించడం లేదని ఆయన ఆరోపించారు.ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరగనున్న నిరసన ఈ ఉద్యమంలో చివరి, అత్యంత ముఖ్యమైన ఘట్టంగా భావిస్తున్నారు. విద్యా రంగంలోని వ్యవస్థాగత వైఫల్యాలకు బాధ్యుడిగా భావిస్తున్న విద్యాశాఖ మంత్రి రాజీనామాతో సహా తమ డిమాండ్లు నెరవేరే వరకు ఈ ఉద్యమం కొనసాగుతుందని దీప్కే పేర్కొన్నారు.ఇటీవలి నిరసనలలో విద్యార్థులు, యంగ్ ప్రొఫెషనల్స్, పౌర సమాజ కార్యకర్తలు పాల్గొన్నారు. స్కూల్, కాలేజీ విద్యార్థులు కూడా హాజరైనట్లు నివేదికలు సూచిస్తున్నాయి. వీరిలో చాలామంది మాస్కులు ధరించి, ప్లకార్డులతో నిరసనలలో పాల్గొనడం సీజేపీకి పెరుగుతున్న ఆదరణను ప్రతిబింబిస్తోంది. ఇప్పుడు నిరసనలు దక్షిణాదికి కూడా విస్తరిస్తున్నందున జూన్ 20న ఢిల్లీలో జరిగే ముగింపు ర్యాలీకి ముందు దేశవ్యాప్తంగా ఊపును తీసుకొచ్చేందుకు సీజేపీ కార్యకర్తలు ప్రయత్నిస్తున్నారు.

# 824 నియోజకవర్గాల పెంపునకు ఈసీ ప్రతిపాదనలు

న్యూఢిల్లీ, జూన్ 12, (న్యూస్ పల్స్)దేశంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై ప్రధాని ఆర్థిక సలహా మండలి  కీలక ప్రతిపాదనలు చేసింది. జనాభాను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకుండా పట్టణీకరణ, ఎస్సీ-ఎస్టీ జనాభా, భాషాపరమైన వైవిధ్యం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని కొత్త నియోజకవర్గాల ఏర్పాటు చేపట్టాలని సూచించింది. ముఖ్యంగా చిన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రాతినిధ్యం పెంచే లక్ష్యంతో అక్కడి లోక్‌సభ స్థానాలను రెట్టింపు చేయాలని సిఫార్సు చేసింది.ప్రస్తుతం దేశంలో 543 లోక్‌సభ స్థానాలు ఉండగా, తాజా ప్రతిపాదనలు అమలైతే వాటి సంఖ్య 824కు చేరే అవకాశం ఉంది. పెద్ద రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న సీట్లను సుమారు 50 శాతం వరకు పెంచే విధంగా మోడల్‌ను రూపొందించింది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా 170 నియోజకవర్గాలను పునర్విభజించాలని నివేదిక పేర్కొంది. వీటిలో 59 నియోజకవర్గాలను రెండు భాగాలుగా, 111 నియోజకవర్గాలను మూడు భాగాలుగా విభజించే అవకాశం ఉందని వెల్లడించింది.కొత్త ప్రతిపాదనల ప్రకారం దక్షిణాది రాష్ట్రాల్లో కూడా ఎంపీ స్థానాల సంఖ్య గణనీయంగా పెరగనుంది. అయితే మొత్తం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్య శాతం ప్రస్తుతం ఉన్న 23.7 శాతం స్థాయిలోనే కొనసాగించేలా ప్రతిపాదనలు రూపొందించారు. కేరళలో ప్రస్తుతం ఉన్న 20 స్థానాలు 30కు, తమిళనాడులో 39 స్థానాలు 59కు పెరిగే అవకాశం ఉంది. అలాగే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కూడా అదనపు లోక్‌సభ స్థానాలు లభించే అవకాశముంది.దేశంలోనే అత్యధిక లోక్‌సభ స్థానాలు కలిగిన ఉత్తరప్రదేశ్‌లో ప్రస్తుతం ఉన్న 80 స్థానాలు 120కు పెరిగే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది. చిన్న నియోజకవర్గాల ఏర్పాటు వల్ల ప్రజాప్రాతినిధ్యం మరింత మెరుగుపడటంతో పాటు దేశవ్యాప్తంగా ఓటింగ్ శాతం సుమారు 2.3 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక సలహా మండలి అంచనా వేసింది.ఇక పట్టణ ప్రాంతాల్లో మహిళల ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేకంగా 'మహిళా పోలింగ్ బూత్‌లు' ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘానికి సిఫార్సు చేసింది. అలాగే 2027 జనాభా లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ చేపట్టాలని కమిటీ స్పష్టం చేసింది. ఈ ప్రతిపాదనలు అమలైతే దేశ రాజకీయ పటంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

## మీనాక్షి నటరాజన్ మీద తెలంగాణ కాంగ్రెస్ నాయకులే కుట్ర చేశారు

భోపాల్,మీనాక్షి నటరాజన్ మీద తెలంగాణ కాంగ్రెస్ నేతలే కుట్ర చేశారని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కుండ బద్దలు కొట్టారు. మీనాక్షి నటరాజన్ మీద అసంతృప్తితో ఉన్న తెలంగాణ కాంగ్రెస్ నాయకుల కుట్ర వల్లే ఆమె నామినేషన్ తిరస్కరణకు గురైందని అయన వ్యాఖ్యానించారు. పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బెంగుళూరు తీసుకెళ్లే ప్లాన్ చివరి నిమిషంలో చార్టెడ్ ఫ్లైట్ డిలే వల్ల ఆగిపోవడం లాంటి అంశాలు చూస్తే ఇది ఖచ్చితంగా తెలంగాణ కాంగ్రెస్ నాయకుల కుట్ర అని అర్థమవుతుందని అయన అన్నారు.

# అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి : ఆడెపు వరలక్ష్మి

ఖైరతాబాద్, జూన్ 12 : అసలే చాలీ చాలనీ వేతనాలు ఇస్తున్నారని, రెండు నెలలుగా అవి కూడా రావడం లేదని తెలంగాణ రాష్ట్ర (మినీ) అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె అంగన్‌వాడీల విషయంలో ప్రభుత్వ తీరును ఎండగట్టారు. రాష్ట్రంలోని 66 వేల మంది అంగన్‌వాడీలు గత రెండు నెలలుగా వేతనాలు లేక అప్పులపాలవుతున్నారని, ప్రభుత్వం జీతాలు ఇవ్వకుండా వేదిస్తోందన్నారు. ప్రతి నెలా జీతాల కోసం ప్రభుత్వాన్ని




అడుక్కోవాల్సిన దుస్థితి దాపురించిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ ప్రభుత్వ అప్పులుకరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించామని, కాని తాము దవాఖానల పాలైతే కనీసం సెలవులు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. తమ ఉద్యోగం, ప్రాణాలకు భరోసా లేదన్నారు. పాలక ప్రభుత్వాలు తమతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నాయి తప్ప తమను రెగ్యూలరైజ్ చేయాలన్న ఆలోచన చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో కనీస వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిందని, రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు అమలు చేసిన దాఖలాలు లేవన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలను చిన్న చూపుచూస్తున్నాయన్నారు. తక్షణమే వేతన బకాయిలు విడుదల చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ప్రతి నెలా 1వ తేదీన జీతాలివ్వాలని కోరారు. అలాగే అప్‌గ్రేడ్ అయిన అంగన్‌వాడీలకు 12 నెలల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని, అవసరమైన చోట హెల్పర్లను నియమించాలని, అదనపు విధులను రద్దు చేయాలని, ప్రీప్రైమరీ పాఠశాలల్లో అర్హత కలిగిన వారికి ప్రాథమిక ఉపాధ్యాయులుగా నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో లక్ష్మి, కవిత, శ్రీలత, మల్లిక, సుజాత, శోభ తదితరులు పాల్గొన్నారు.

# మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగం.. మమతా బెనర్జీపై ఎఫ్ఐఆర్ నమోదు

టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదైంది. దక్షిణ కోల్‌కతాలోని నేతాజి నగర్ పోలీస్ స్టేషన్‌లో కోల్‌కతాకు చెందిన ఒక వ్యక్తి మమతపై ఫిర్యాదు చేశాడు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మమత గత మార్చిలో ధర్మతలలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకవర్గానికి వ్యతిరేకంగా, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారని ఆమెపై




నమోదైన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి మీరు క్షేమంగా ఉన్నారని, లేకుంటే ఒక వర్గం చేతిలో అణిచివేతకు గురయ్యే వారు అంటూ అప్పట్లో మమత వ్యాఖ్యానించినట్లు ఫిర్యాదులో వివరించారు. ఆమె వ్యాఖ్యలు మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. వివిధ వర్గాల మధ్య వైషమ్యాలు, భయం పెంపొందించేలా, ఉద్రిక్తతలు రెచ్చగొట్టేలా మమత వ్యవహరించారని ఫిర్యాదులో వివరించారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. మే 20న ఈ ఫిర్యాదు దాఖలైంది. శుక్రవారం ఈ ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన మమతకు తాజా రాజకీయ పరిణామాలు ఇబ్బందిగా మారిన సంగతి తెలిసిందే.పార్టీకి చెందిన మెజారిటీ నేతలు టీఎంసీని వీడుతున్నారు. ఎంపీలు రెబల్స్‌గా ఏర్పడి బీజేపీకి మద్దతు ప్రకటించారు. తమను ప్రత్యేక వర్గంగా చూడాలని లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. మరోవైపు ఎమ్మెల్యేలు కూడా పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారు. దీంతో పశ్చిమ బెంగాల్‌లో ఇప్పుడు టీఎంసీ భవితవ్యంతోపాటు మమత రాజకీయ భవిష్యత్ కూడా ప్రశ్నార్థకంగా మారింది.

# మళ్లీ కవ్విస్తున్న పాకిస్తాన్

న్యూఢిల్లీ, జూన్ 12, (న్యూస్ పల్స్)గత ఏడాది సరిగ్గా ఇదే సమయానికి పాకిస్థాన్ నెత్తినోరూ మొత్తుకుంది. బ్బాబ్బాబూ మమ్మల్ని వదిలేయండి మీకు దండం పెడతాం అంటూ కాళ్లు పట్టుకుంది. చచ్చిన పామును ఏం చంపుతామని భారత్ బతుకుపో అంటూ వదిలిపెట్టింది. లేకుంటేనా పాకిస్థాన్ ప్రపంచ పటంలో ఉండేదే కాదు.భారత్ దయాదాక్షిణ్యాల మీద బతికిన పాకిస్థాన్ మళ్లీ పిచ్చి లేసిన కుక్క లాగా అరవడం మొదలుపెట్టింది. సరిహద్దుల్లో మళ్లీ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. నిబంధనలు అతిక్రమించి జమ్మూలో భారత సైన్యం ఏర్పాటు చేసుకున్న చెక్ పోస్టుల ప్రాంతాలలో పాకిస్థాన్ సైన్యం ఈనెల 9న తెల్లవారుజామున డ్రోన్లను పంపించింది.ఆ డ్రోన్లను కూల్చివేయడానికి భారత సైన్యం 15 రౌండ్ల పాటు కాల్పులు జరపాల్సి వచ్చింది. అయితే ఆ డ్రోన్లు మళ్లీ పాకిస్థాన్ భూభాగంలోకి వెళ్లిపోయాయి. ప్రతిసారీ నిబంధనలు అతిక్రమించడం పాకిస్థాన్ కు అలవాటే. కాకపోతే పహల్గాం ఘటన తర్వాత భారత్ కట్టుదిట్టంగా భద్రతను ఏర్పాటు చేస్తోంది. సరిహద్దుల్లో చీమచిటుక్కుమన్నా తెలిసేలా సెక్యూరిటీ ఏర్పాటు చేసింది. అందువల్లే పాకిస్థాన్ డ్రోన్లపై భారత్ కాల్పులు జరిపింది.ఇలాంటి పనులు పాకిస్థాన్ ఎందుకు చేస్తోందంటే..ప్రస్తుతం పాకిస్థాన్ లో అంతర్గత సంక్షోభాలు ఏర్పడ్డాయి. భారత్ జీలం, చినాబ్ నది ప్రవాహాలకు అడ్డుకట్ట వేసింది. దీంతో పాకిస్థాన్ లో వ్యవసాయం సాగే పరిస్థితి లేదు. పీవోకే లో పాకిస్థాన్ కు వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్నాయి. బలూచిస్థాన్ ఆర్మీ పాకిస్థాన్ కు చుక్కలుచూపిస్తోంది. ఆర్థిక సంక్షోభం కూడా పాకిస్థాన్ పాలకులను కలవరపాటుకు గురి చేస్తోంది.ఇవన్నీతగ్గిపోవాలంటే ఏదోఒకటి చేయాలి. భారత్ మీద దాడులు చేసినట్టు కలరింగ్ ఇస్తే అంతర్గత సంక్షోభాలను డైవర్ట్ చేయవచ్చని పాకిస్థాన్ భావిస్తోంది. అయితే ఆపరేషన్ సిందూరు జస్ట్ శాంపిల్ మాత్రమేనని..ఈసారి పాకిస్థాన్ కయ్యానికి కాలు దువ్వితే.. లేపడానికి కాలు..దువ్వాడానికి చేయి ఉండవని భారతసైన్యం స్పష్టం చేస్తోంది. అంటే ఈలెక్కన పాకిస్థాన్ దేశాన్నిప్రపంచ పటం నుంచి తీసివేయడానికి భారత్ గట్టిగా ఫిక్స్ అయిందన్నమాట.

# 19న హైదరాబాద్ కు పవన్...

హైదరాబాద్, జూన్ 12, (న్యూస్ పల్స్)ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజకీయంగా ఎంత యాక్టీవ్ గా ఉన్నాడో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఒకపక్క పాలన పరంగా తనదైన మార్కు తో ముందుకు వెళ్తూ , మరోపక్క జనసేన పార్టీ ని బలోపేతం చెయ్యడానికి అన్ని విధాలుగా ప్లానింగ్ చేస్తున్నాడు. జనసేన పార్టీ ని కేవలం ఆంధ్ర ప్రదేశ్ కి మాత్రమే పరిమితం చేయకుండా, తెలంగాణ ప్రాంతానికి కూడా విస్తరింపజేసే ప్రయత్నం చేస్తున్నాడు. రీసెంట్ గా పవన్ కళ్యాణ్ తెలంగాణ



రాష్ట్ర రాజకీయాల్లో సృష్టించిన అలజడి ఎలాంటిదో కళ్లారా చూసాము. కావాలని ఆయన్ని టార్గెట్ చేస్తూ , కాంగ్రెస్ పార్టీ జనసేన క్యాడర్ ని , జనసేన నాయకులను తెలంగాణ వ్యాప్తంగా యాక్టీవ్ అయ్యేలా చేసింది. ఒకపక్క తెలంగాణ పై తన ఫోకస్ ప్రస్తుతానికి లేదని పవన్ కళ్యాణ్ చెప్తూనే , మరోపక్క అక్కడ ఆ పార్టీని బలోపేతం చేయడానికి అన్ని విధాలుగా సిద్ధం అవుతున్నాడు.అందులో భాగంగా ఈ నెల 19 న ఆయన తెలంగాణ లో జనసేన పార్టీ పీకార్యాలయాన్ని గ్రాండ్ గా ప్రారంభించబోతున్నట్టు సమాచారం. ఏ ప్రాంతం లో ఆయన ఈ కార్యాలయాన్ని ప్రారంభించబోతున్నాడు అనేది ప్రస్తుతానికి తెలియదు. మరో రెండు రోజుల్లో దీనికి సంబంధించిన పూర్తి వివరాలు బయటకు రానున్నాయి. పవన్ కళ్యాణ్ కి ప్రస్తుతం తెలంగాణ మీద ఆసక్తి లేకపోయినప్పటికీ,జనసేన పార్టీ క్యాడర్ మాత్రం ఒప్పుకోవడం లేదు , ఎట్టి పరిస్థితిలోనూ తెలంగాణ లో జనసేన పార్టీ ని క్షేత్రస్థాయి నుండి బలోపేతం చేయాల్సిందే అని పవన్ పై ఒత్తిడి తెస్తున్నారు. అందుకే వాళ్ళ కోసం ఆయన ఇకపై తెలంగాణ పై పూర్తి స్థాయిలో ఫోకస్ చేసినట్టు తెలుస్తోంది. అంతే కాదు ఆయన రీసెంట్ గా జరిగిన ఒక ఇంటర్వ్యూ లో కాంగ్రెస్ పార్టీ పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడడం చూస్తుంటే , రాబోయే రోజుల్లో ఆయన అధికార కాంగ్రెస్ ని చాలా గట్టిగానే టార్గెట్ చేయబోతున్నట్టు తెలుస్తోంది. మరి ఇందులో ఎంత మాత్రం నిజముందో చూడాలి.

# సిటీలో డేంజర్ బిల్డింగ్స్ 377

హైదరాబాద్, జూన్ 12, (న్యూస్ పల్స్)మహానగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఎప్పుడు ఏ పాత భవనం లేదా ప్రహరీ గోడ కూలిపోతుందోనని నగరవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నిర్మాణంలో ఉన్న సెల్లార్ల వద్ద మట్టి దిబ్బలు కూలి కార్మికులు చిక్కుకుపోయే ప్రమాదాలు పొంచి ఉండటంతో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం అప్రమత్తమైంది. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు నగర ప్రధాన ప్రణాళికాధికారి కె. శ్రీనివాస్ జోన్ల వారీగా ప్రత్యేక సర్వే నిర్వహించారు. క్షేత్రస్థాయి అధికారుల నుండి సేకరించిన వివరాల ప్రకారం, జూన్ 5 నాటికి నగరవ్యాప్తంగా మొత్తం 377 శిథిల భవనాలు ఉన్నట్లు లెక్క తేలింది. ఈ సర్వే ఇంకా కొనసాగుతోందని, మరిన్ని భవనాలను గుర్తిస్తామని గ్రేటర్ టౌన్ ప్లానింగ్ విభాగం వెల్లడించింది.

రాజేంద్రనగర్ జోన్‌లోనే అత్యధికం

బల్దియా సర్వే గణాంకాల ప్రకారం.. శిథిల భవనాలు అత్యధికంగా రాజేంద్రనగర్ జోన్ పరిధిలోనే ఉన్నట్లు స్పష్టమవుతోంది. జోన్ల వారీగా గుర్తించిన శిథిల భవనాల వివరాలు ఇలా ఉన్నాయి:

రాజేంద్రనగర్: 117 భవనాలు
శేరిలింగంపేట: 75 భవనాలు
సికింద్రాబాద్: 70 భవనాలు
చార్మినార్: 56 భవనాలు
గోల్కొండ: 47 భవనాలు
ఖైరతాబాద్: 12 భవనాలు

కమిషనర్ కఠిన ఆదేశాలు.. సెల్లార్ల అనుమతులు రద్దు!

ప్రమాదాల నివారణకు బల్దియా కమిషనర్ సర్కిళ్ల ఉపకమిషనర్లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. పాత కట్టడాలు, బలహీనమైన గోడలను గుర్తించి, అవసరమైన వాటికి ఇంజనీరింగ్ నిపుణులతో సామర్థ్య పరీక్షలు చేయించాలని సూచించారు. ఏదైనా భవనం నివాసయోగ్యం కాదని తేలితే ఆ ఇంటిని వెంటనే సీజ్ చేయాలని, ముందుగా యజమానులకు నోటీసులు ఇచ్చి, తక్షణమే ఖాళీ చేయించాలని స్పష్టం చేశారు. ప్రమాదకర భవనాల చుట్టూ బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

## ఢిల్లీ నుంచి మంగళూరుకు తమిళనాడు సీఎం విజయ్.. మూకాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు!



న్యూ ఢిల్లీ, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నీతి ఆయోగ్ సమావేశం ముగిసిన అనంతరం ఢిల్లీ నుంచి బయలుదేరి మంగళూరు చేరుకున్నారు. మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న సీఎం విజయ్, అక్కడి నుంచి ఉడిపి జిల్లాలోని ప్రసిద్ధ కొల్లూరు శ్రీ మూకాంబిక దేవి ఆలయానికి వెళ్లనున్నట్లు సమాచారం. తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే దక్షిణ భారతదేశంలోని అత్యంత శక్తివంతమైన పుణ్యక్షేత్రాల్లో ఒకటైన మూకాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు విజయ్. ఇక గతంలో మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ ఈ ఆలయాన్ని దర్శించుకుని, సుమారు కిలో బరువు, 2.5 అడుగుల పొడవు గల ఖడ్గాన్ని కానుకగా సమర్పించారు. ఆ ఖడ్గాన్ని ప్రస్తుతం ఆలయంలో ప్రత్యేక పూజల సమయంలో ప్రదర్శిస్తుంటారు. మరోవైపు సీఎం విజయ్ పర్యటన నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు అధికారులు.

## గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చిన న్యాయవాదులు



జోగులాంబ గద్వాల : కోర్టు సముదాయాని కి అనువైన స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేస్తూ గద్వాల బార్ అసోసియేషన్న్యాయవాదులు శుక్రవారం వినూత్న నిరసన చేపట్టారు. జిల్లా కోర్టు ఆవరణ నుంచి ర్యాలీగా బయలుదేరిన న్యాయవాదులు గాంధీచౌక్‌కు చేరుకుని మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ నిర్ణయాన్ని మార్చేలా చూడాలని వారు మహాత్ముని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది గట్టు సురేష్ మాట్లాడుతూ కొద్దిమంది ప్రయోజనాల కోసం లక్షలాది ప్రజల సౌకర్యాలను పణంగా పెట్టడం సమంజసం కాదన్నారు. జిల్లా కోర్టు ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వాన్ని నిర్ణయం తీసుకోవాలని కోరారు. గుట్టల వద్ద కోర్టు నిర్మాణాన్ని తాము వ్యతిరేకిస్తున్నది అభివృద్ధిని అడ్డుకోవడానికి కాదని, ప్రజలకు సౌకర్యవంతమైన, సురక్షితమైన , అందుబాటులో ఉండే స్థలం కోసం మాత్రమే తమ పోరాటమని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం స్పందించే వరకు ఉద్యమం కొనసాగుతుంని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు కావాలి నరసింహులు, రాజశేఖరరెడ్డి, ఖాజా మొయినుద్దీన్, రవి ప్రకాష్ గౌడ్, నాగరాజు, విష్ణువర్ధన్ రెడ్డి, లత్తిపురం వెంకట్రామిరెడ్డి, రమేష్, శివప్రియ, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## హాట్‌కేకుల్లా స్పేస్‌ఎక్స్ ఐపీవో సేల్.. ప్రపంచ తొలి ట్రిలియనీర్‌గా ఎలన్ మస్క్

న్యూయార్క్: స్పేస్‌ఎక్స్ కంపెనీ సీఈవో ఎలన్ మస్క్ ఇప్పుడు ట్రిలియనీర్ అయ్యారు. ఆయన సంపద ఇప్పుడు లక్ష కోట్లు దాటేసింది. తాజాగా ఆ కంపెనీ ఐపీవో సేల్స్ జరిగాయి. హాట్‌కేకుల్లా ఆ కంపెనీ షేర్లు అమ్ముడుపోయాయి. అనూహ్య రీతిలో ఆయన సంపద పెరిగిపోయింది. హేమీహేమీ టైకూన్లను దాటివేస్తూ.. ఔత్సాహిక వ్యాపారి దశ నుంచి ట్రిలియనీర్‌గా ఆయన ఎదిగారు. రాకెట్లు, శాటిలైట్లు, ఏఐ కంపెనీలు, టెస్లా కార్లు.. మస్క్ వ్యాపారంలో ఉన్నాయి. అయితే తాజా ఐపీవో ద్వారా స్పేస్‌ఎక్స్ కంపెనీ 75 బిలియన్ల డాలర్లు ఆర్జించింది. ఇన్షియల్ పబ్లిక్ ఆఫరింగ్‌లో పెట్టుబడిదారులు ఉత్సాహంతో పాల్గొన్నట్లు తెలుస్తోంది. అమెరికాలో ఐపీవో సేల్‌లో ఒక్కొక్క షేర్‌ను 135 డాలర్లకు అమ్మేశారు. దీంతో మస్క్ రాకెట్, స్పేస్‌క్రాఫ్ట్ తయారీ కంపెనీ విలువ అమాతం పెరిగింది. మొత్తం 555.56 మిలియన్ల షేర్లను అమ్మేశారు. దాంతో ఆ కంపెనీకి ఐపీవో ద్వారా సుమారు 75 బిలియన్ల డాలర్లు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో స్పేస్, శాటిలైట్, ఏఐ కంపెనీల మొత్తం విలువు సుమారు 1.77 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ తొలిసారి శుక్రవారం వాల్‌స్ట్రీట్ ట్రేడింగ్‌లోకి వెళ్లింది. నాస్‌డాక్‌లో ట్రేడింగ్ కోసం షేర్లను అమ్మిన అమెరికా కంపెనీల్లో స్పేస్‌ఎక్స్ ఏడో స్థానంలో ఉన్నది. ఫోర్బ్స్, ఆల్ఫాబెట్ కంపెనీలు కూడా గతంలో షేర్లను సేల్ చేశాయి. రెండో సంపన్న వ్యక్తి కేవలం 300 బిలియన్ల డాలర్ల దగ్గరే ఉన్నారని, అంటే మస్క్ దగ్గర ఉన్న దాంట్లో మూడో వంతు అని ఫోర్బ్స్ వెల్త్ ఎడిటర్ మాట్ డ్యూరట్ తెలిపారు. ఒరాకిల్ ఫౌండర్ లారీ ఎల్లిసన్ సంపద సుమారు 400 బిలియన్ల డాలర్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు.



## ఉద్యోగులను తక్కువ చేసి చూస్తే ఊరుకోం : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్ : ప్రభుత్వ ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. ఉద్యోగులకు తక్కువ చేసి చూస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో కార్పొరేషన్ మాజీ చైర్మన్ జి .దేవీప్రసాద్, టీఎన్జీవో అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్ వార్తలుప్రభుత్వ మొండి వైఖరి వల్ల తెలంగాణలో 10 నుంచి 15 లక్షల కుటుంబాల ఉద్యోగులు పెన్షన్ దారులు ఆందోళనలో ఉన్నారని ఆరోపించారు. హెల్త్ కార్డ్స్ ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం చేస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర యేండ్లలో ఇంతవరకు ఉద్యోగులకు, పెన్షన్ దారులకు హెల్త్ కార్డ్స్ ఇవ్వలేదని ఆరోపించారు. కాంట్రాక్టు ఉద్యోగులకు సకాలంలో జీతాలు రావడం లేదని అన్నారు. హెల్త్ కార్డ్స్ ఇష్యూపై కమిటీ వేశారే తప్పా హెల్త్




కార్డ్స్ మాత్రం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. కమిటీ ముఖ్యమంత్రి మాట వినడం లేదా? ముఖ్యమంత్రి మాట కమిటీ వినడం లేదా అర్థం కావడం లేదని విమర్శించారు. పీఆర్‌సీ 6 నెలల్లో క్లియర్ చేస్తామని చెప్పి ఇంతవరకు ఆ ఊసే లేదని అన్నారు. బీఆర్ఎస్ హయంలో ఉద్యోగులను కాపాడుకున్నామని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వ అప్పులుఒక్కో ఉద్యోగి నుంచి నెలకు 2 వేల నుంచి 3 వేల వరకు డబ్బులు కట్ అవుతున్నాయి. ఉద్యోగి జీతం నుంచి డబ్బులు కట్ చేయమని ఈ ప్రభుత్వానికి చెప్పింది ఎవరని ప్రశ్నించారు. ఉద్యోగులను తక్కువ చేసి చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆరోగ్యం విషయంలో ఉద్యోగులు చనిపోతే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. జూన్ 1 నుంచి హెల్త్ కార్డ్స్ ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదని విమర్శించారు.

కలిసొచ్చే ఉద్యోగ సంఘాలతో పోరాటం : మాజీ చైర్మన్ జి .దేవీప్రసాద్

హెల్త్ కార్డ్స్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం గందరగోళం సృష్టిస్తుందని దేవి ప్రసాద్ అన్నారు.

ఉద్యోగి సమ్మతి లేకుండా జీతం కట్ చేయవద్దని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పినా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వినిపించుకోవడం లేదని తెలిపారు. కేసీఆర్ పరిపాలనలో అంగన్‌వాడీ వర్కర్స్ కు ఏ రాష్ట్రంలో లేని విధంగా జీతాలు ఇచ్చారని గుర్తు చేశారు.

## 'ప్రాణాలకు తెగించైనా వైటీపీఎస్ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం'

దామరచర్ల, జూన్ 12 : ప్రాణాలకు తెగించైనా యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణ అడ్డుకుని కాపాడుకుంటామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. కేసీఆర్ కలల ప్లాంట్ అయిన వైటీపీఎస్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ శుక్రవారం ప్లాంట్ ముందు బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యాదాద్రి పవర్ ప్లాంట్ ను నడిపించే సత్తా లేక కమిషన్లకు కక్కుర్తి పడి ప్లాంట్‌ను కాంట్రాక్టర్లకు అప్పచెప్పడం సిగ్గుచేటు అన్నారు. పవర్ ప్లాంట్ ఏర్పాటు సమయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్, జగదీశ్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు దామరచర్ల మండల ప్రాంతంలో పవర్ ప్లాంట్ ఏర్పాటుకు అన్ని గ్రామాల ప్రజలు సహకరించడం జరిగిందని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పవర్ ప్లాంట్ కింద నష్టపోయిన నిర్వాసితులకు తగిన న్యాయం చేయకుండా ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం వల్ల ప్రభావిత గ్రామాల ప్రజలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఉద్యోగుల కొరతను కారణంగా చూపుతూ ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్లాంట్ కింద నష్టపోయిన భూ



నిర్వాసితులు, ఎంక్రోచర్స్ తో పాటుగా స్థానికులకు పూర్తిస్థాయిలో ఉద్యోగాలు కల్పించినట్లయితే ఉద్యోగుల కొరత ఉండదన్నారు, ప్లాంట్‌లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్ లో ప్రస్తుతం నాలుగు యూనిట్లు ప్రారంభమై 3,200 మెగావాట్ల విద్యుత్ రాష్ట్రానికి అందిస్తున్నదని అందుకు కావాల్సిన ఉద్యోగ నియామకాలు మాత్రం జరపడం లేదన్నారు. ప్లాంట్ ను ప్రైవేటీకరిస్తే స్థానికులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రైవేటీకరణను నిలిపివేయాలన్నారు. లేకుంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానికులతో కలిపి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ప్రాణాలకు తెగించైనా పవర్ ప్లాంట్ ప్రైవేటికరణను అడ్డుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కె.వీరకోటిరెడ్డి, ఎండీ.యూసుఫ్, సోమ సైదిరెడ్డి, కొనకంచి సత్యనారాయణ, రాయికింది సైదులు, వినోద్, కొండారపూ నాగేశ్వరరావు, కొండారపు శ్రీనివాస్, బంగారు సైదిరెడ్డి, బైరం గోపి పాల్గొన్నారు.

## బ్యాంకాక్ నుంచి గంజాయి స్మగ్లింగ్..

### కేరళ మోడల్ అరెస్ట్

ముంబై, జూన్ 12: మోడలింగ్ రంగంలో రాణిస్తూ.. కేరళ అందాల పోటీల్లో పాల్గొన్న ఓ యువతి, ఒక్క రాత్రిలో డ్రగ్స్ స్మగ్లర్‌గా మారి జైలుపాలైంది. బ్యాంకాక్ నుంచి ముంబైకి రూ.11.82 కోట్ల విలువైన హై-క్వాలిటీ 'హైడ్రోపోనిక్ గంజాయి'ని స్మగ్లింగ్ చేస్తూ.. మాజీ 'మిసెస్ కేరళ' కంటెస్టెంట్ హర్ష సన్నీ (28) ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులకు అడ్డంగా దొరికిపోయింది. ఎయిర్ ఇండియా విమానం (ఎఉ-351) ద్వారా బ్యాంకాక్ నుంచి ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి హర్ష సన్నీ చేరుకుంది. లగేజీ క్లియరెన్స్ సమయంలో ఆమె ప్రవర్తన కాస్త అనుమానాస్పదంగా ఉండటాన్ని ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఏఐఉ), కస్టమ్స్ అధికారులు గమనించారు. ఆమెను పక్కకు పిలిచి, ఆమె వద్ద ఉన్న ట్రావెల్ బ్యాగ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆ బ్యాగులో ప్యాక్ చేసిన 12 ప్లాస్టిక్ ప్యాకెట్లు కనిపించాయి. వాటిలో పచ్చటి పదార్థం ఉంది. వెంటనే అధికారులు



'ఎన్‌డిపిఎస్' కిట్‌తో కెమికల్ టెస్ట్ చేయగా, అది అత్యంత ఖరీదైన, నాణ్యమైన 'హైడ్రోపోనిక్ మారిజువానా' (గంజాయి) అని తేలింది. సాధారణ గంజాయితో పోలిస్తే ల్యాబ్‌లలో నియంత్రిత వాతావరణంలో పెంచే ఈ హైడ్రోపోనిక్ గంజాయికి మార్కెట్లో విపరీతమైన డిమాండ్, ధర ఉంటుంది. హర్ష సన్నీ వద్ద దొరికిన 11 కిలోల గంజాయి విలువ అంతర్జాతీయ బ్లాక్ మార్కెట్లో సుమారు రూ.11.82 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. దీంతో ఆమెపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కోర్టు ఆమెకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది.

## ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు.. లక్నోలో టేకాఫ్‌కు ముందే ప్రయాణికుల దింపివేత




ఇండిగో విమానానికి శుక్రవారం బాంబు బెదిరింపు వచ్చింది. జూన్ 12న లక్నో నుంచి ఢిల్లీ బయల్దేరాల్సిన విమానానికి బాంబు బెదిరింపు వచ్చిందని ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. విమానం టేకాఫ్ కావడానికి కొద్ది నిమిషాల ముందు బాంబు బెదిరింపు వచ్చింది. సమాచారం అందుకున్న భద్రతాదళాలు వేగంగా స్పందించాయి. విమానాన్ని నిలిపివేశారు. విమానంలోని ప్రయాణికుల్ని, సిబ్బందిని దింపివేశారు. దూరంగా నిలిపి తనిఖీలు చేపడుతున్నారు. సీఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్)తోపాటు స్థానిక పోలీసులు ఈ సెక్యూరిటీ ఆపరేషన్స్‌లో పాల్గొంటున్నారు. సెక్యూరిటీ ప్రొటోకాల్ ప్రకారం అధికారులు విమానంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రయాణికులకు సమాచారాన్ని చేరవేసి, వారి కోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. బాంబు బెదిరింపు కాల్ తర్వాత కొద్దిసేపు విమాన సేవలకు ఎయిర్‌పోర్టులో అంతరాయం కలిగింది. కొన్ని విమాన సర్వీసులకు ఆలస్యం కానున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ముందు జాగ్రత్త చర్యగా అధికారులు ఎయిర్‌పోర్టులో కూడా తనిఖీలు చేపడుతూ, భద్రతను కట్టుదిట్టం చేశారు. మరోవైపు ఈ బాంబు బెదిరింపు ఎవరు చేశారు.. ఎక్కడ్నుంచి వచ్చింది అనే అంశాలపై కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. ప్రయాణికుల భద్రతే తమ మొదటి ప్రాధాన్యమని ఎయిర్‌పోర్ట్ అధికారులు ప్రకటించారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రోటోకాల్ ప్రకారం అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## మహిళల సంఖ్య తగ్గిపోయింది.. చైనా కోలుకోవడం అసాధ్యం: యూఎస్ ఇన్వెస్టర్



చైనాలో జనాభా తగ్గుదల నేపథ్యంలో దేశాభివృద్ధి పడిపోనుందని అమెరికన్ ఇన్వెస్టర్, మార్టిన్ క్యాపిటల్ సంస్థ వ్యవస్థాపకుడు రాడ్ డీ మార్టిన్ తాజాగా తెలిపారు. ప్రస్తుత గణాంకాల ప్రకారం చూస్తే చైనా జనాభా మళ్లీ పెరగడం అసాధ్యమని స్పష్టం చేశారు. జనాభా మళ్లీ పెరిగేందుకు సరిపడా చైనాలో మహిళల సంఖ్య లేదని అన్నారు. కాలం గడిచే కొద్దీ చైనాలో వినియోగదారులు తగ్గిపోయి, మార్కెట్ కుంచించుకుపోయి, శక్తిమంతమైన దేశం కావాలన్న చైనా కల చెదిరిపోతుందని చెప్పారు. 'చైనా పతనం తథ్యం. గణాంకాలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. జనాభా మళ్లీ కోలుకునేందుకు కావాల్సిన సంఖ్యలో అక్కడ మహిళలు లేరు' అని అన్నారు. ఐరోపా, జపాన్‌లో మాత్రం జనాభా తగ్గుదల అనేది ఒక్కసారిగా కాకుండా క్రమంగా జరుగుతోందని చెప్పారు. మహిళల సంఖ్య తగ్గిపోయిన కారణంగా చైనాలో తీవ్ర స్థాయి మార్పులు కనిపిస్తున్నాయని చెప్పారు. 1980-2016 మధ్య చైనా అనుసరించిన 'ఏక సంతాన విధానం' వల్ల జనాభాలో స్త్రీపురుష నిష్పత్తి భారీ స్థాయిలో ప్రభావితమైందని నిపుణులు చెబుతున్నారు. ఏక సంతాన విధానానికి తోడు అబ్బాయిలే కావాలన్న తల్లిదండ్రుల భావన, ఆడపిల్లలు పుట్టకుండా అబార్షన్లు వంటివన్నీ ప్రస్తుత పరిస్థితికి దారితీశాయని చెబుతున్నారు. మునుపటి తరంలో మొదలైన అసమానతలన్నీ తదుపరి తరంలో మరింత తీవ్రరూపం దాల్చే పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. 2100 నాటికల్లా చైనా జనాభా సగానికి (633 మిలియన్లు) పడిపోతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## రిజర్వేషన్లపై కేంద్రానికి నివేదిక సమర్పించనున్న జస్టిస్ బాలకృష్ణన్

న్యూఢిల్లీ, జూన్12: మతం మారిన దళితులకు రిజర్వేషన్ల అమలుపై కేంద్రం నియమించిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిషన్.. తన నివేదికను సిద్ధం చేసింది. దళిత క్రైస్తవ, ముస్లింల ఎస్సీ హోదాతోపాటు మతం మారిన దళితులకు ఎస్సీ హోదా కల్పనపై జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్ నివేదికను పూర్తి చేసింది. త్వరలో ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి ఈ కమిషన్ అందజేయనుంది. ఈ అంశాలపై దాదాపు నాలుగేళ్ల పాటు సుదీర్ఘ అధ్యయనం చేసి ఈ నివేదికకు జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిషన్ రూపొందించింది. జస్టిన్ కేజీ బాలకృష్ణన్ కమిషన్ నివేదికపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. క్రైస్తవ, ఇస్లాం మతాల్లోకి మారిన దళితులకు ఎస్సీ హోదా ఇవ్వాలా? వద్దా? అనే అంశంపై ఈ కమిషన్ అధ్యయనం చేసింది. ప్రస్తుతం ఈ కమిషన్



నివేదిక ముద్రణ దశలో ఉంది. మరి కొద్ది రోజుల్లో కేంద్రానికి ఈ నివేదికను కమిషన్ అందజేయనుంది. జూన్ 10వ తేదీతో జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిషన్ గడువు ముగిసింది. అయితే మరో10 రోజులపాటు ఈ కమిషన్ గడువును కేంద్రం పొడిగించింది. మతం మారిన తర్వాత కూడా దళితులు సామాజిక వివక్షను ఎదుర్కొంటున్నారా? అనే అంశంపై ప్రజల్లోకి వెళ్లి ఈ కమిషన్ ఆరా తీసింది. 1950 నాటి రాజ్యాంగం ఉత్తర్వు ప్రకారం హిందూ, సిక్కు, బౌద్ధ మతాల్లోని దళితులకు మాత్రమే ఎస్సీ హోదా ఇస్తున్నారు. ముస్లిం, క్రైస్తవ మతాల్లోని దళితులకు కూడా ఎస్సీ హోదా కల్పించాలని చాలా కాలంగా దళిత సంఘాల డిమాండ్ చేస్తున్నాయి. ఇస్లాం, క్రైస్తవ మతాల్లో కుల వ్యవస్థ లేదంటూ ఇప్పటికే సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్ దాఖలు చేసింది. ఇస్లాం, క్రైస్తవ మతాల్లో చేరిన దళితులకు రిజర్వేషన్లు వర్తించవని ఇటీవల సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించిన విషయం విదితమే. ఈ కమిషన్ సిఫార్సులపై దేశవ్యాప్తంగా అటు రాజకీయాల్లోనూ, ఇటు సామాజిక వర్గాల్లోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# కేంద్రమంత్రి పదవా... గవర్నరా...

విజయవాడ, జూన్ 12, ఢిల్లీలో పర్యటించిన చంద్రబాబుకు కేంద్రంలోని పెద్దలు బిగ్ ఆఫర్ ఇచ్చినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఎన్డీయే కూటమిని మరింత బలోపేతం చేసేందుకు బీజేపీ పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న పార్టీల జోరు.. ఇండియా కూటమి వేస్తున్న అడుగులను నిశితంగా గమనిస్తున్న ప్రధాని నరేంద్రమోడీ.. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాలు.. ప్రస్తుత కూటమిని మరింత బలోపేతం చేసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు.దీనిలో భాగంగా దక్షిణాదిలో తమకు కీలక పార్టీలుగా ఉన్నటీడీపీ, జనసేనలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో ప్రధానంగా టీడీపీకి ఒక గవర్నర్ పోస్టును.. లేదా కేంద్ర మంత్రి వర్గంలో మరో బెర్త్‌ను ఆఫర్ చేసినట్టు జాతీయ రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. దీనిని ఒక ఎంపీ కూడా ధ్రువీకరించారు. చర్చలు జరిగాయి. సీఎం చంద్రబాబు నిర్ణయమే ఫైనల్. మేం రెండూ కావాలని అడుగుతున్నాం. అని ఉత్తరాంధ్రకు చెందిన ఓ ఎంపీ వ్యాఖ్యానించారు.ప్రస్తుత లెక్క ప్రకారం చూస్తే.. టీడీపీకి రెండు మంత్రి పదవులు ఉన్నాయి. గుంటూరు ఎంపీ చంద్రశేఖర్, శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడు కేంద్రంలో మంత్రులుగా ఉన్నారు. ఇక, గవర్నర్‌పోస్టుల విషయానికి వస్తే.. గోవా గవర్నర్‌గా విజయనగరం మాజీ ఎంపీ.. పూసపాటి అశోక్ గజపతి రాజు వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరో కేంద్రమంత్రి పదవితోపాటు.. మరో గవర్నర్ సీటును కూడా టీడీపీ ఆశిస్తున్న విషయం ఇటీవల కాలంలో చర్చకు వస్తోంది. ప్రస్తుతం ఎన్డీయే కూటమికి టీడీపీ కీలక మద్దతు దారుగా ఉంది.తమకు మరో రెండు పదవులు కావాలని.. కొన్నాళ్లుగా చంద్రబాబు ఢిల్లీ పెద్దలను కోరుతున్నారు. ఈ క్రమంలో తాజాగా బాబు కోరికను మన్నించి.. కూటమికి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధాని సహా కీలక నేతలు నిర్ణయించారు. ఈ క్రమంలో ఒక గవర్నర్ లేదా.. ఒక మంత్రి పదవిని ఇస్తామని చెప్పారని తెలిసింది. దీనిపై తన పార్టీ నాయకులతో ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని బాబు కూడా రిప్లయి ఇచ్చారని సమాచారం. ఇక, పార్టీ వర్గాల కథనం మేరకు రెండూ కావాలన్నది చంద్రబాబు ఉద్దేశం. దీనిని ఒప్పించేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని కూడా సమాచారం. మరి ఏం జరుగుతుందో చూడాలి.జనసేన అధినేత పవన్ కల్యాణ్.. తన వ్యూహాన్ని దాదాపు తేల్చేశారు. రాజకీయంగా తనకు ఉన్న లక్ష్యాన్ని కూడా వివరించారు. దేశాన్ని ఐక్యం చేయడంతోపాటు.. ఉత్తర-దక్షిణ ప్రాంతాలు అనే భేదాన్ని తుడిచి పెట్టి.. అందరూ ఒక్కటే అనే విధంగా దేశాన్ని కలిపి ఉంచాలన్న తన మనసులోని భావాలను వెల్లడించారు. అదేసమయంలో తన టార్గెట్ కూడా కాంగ్రెస్ పార్టీనేనని ఆయన పరోక్షంగా చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పార్టీ విధానాల కారణంగానే దేశంలో విభజన వాదం వచ్చిందని పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణలను విడదీసినందుకు, తెలంగాణ ఇచ్చినందుకు తనకు బాధలేదన్న ఆయన.. విభజన చేసిన తీరును, ఏపీకి మిగిల్చిన కష్టాలపైనే తన ఆవేదన అని పేర్కొన్నారు. దీనికి మూల కారణం.. కాంగ్రెస్ పార్టీనేనని స్పష్టం చేశారు. అంతేకాదు.. ఏపీకి ప్రత్యేక హోదా విషయంలోనూ కాంగ్రెస్ పార్టీ చేసిందే ఘోర తప్పిదమని వ్యాఖ్యానించారు. ప్రధాని మోడీని ఆడిపోసుకోవడం సరికాదని పేర్కొన్నా రు. ఆనాడే పార్లమెంటులో చట్టంలో చేర్చి ఉంటే సమస్య ఉండేది కాదన్నారు.అంతేకాదు.. పలువురు ముఖ్యమంత్రులు(కాంగ్రెస్) ఉత్తరం, దక్షిణం అంటూ.. దేశానికి గోడలు కట్టే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తన దృక్పథంలో దేశం అంతా ఒక్కటేనని చెప్పారు. దేశ ఐక్యత కోసం.. ఎంతోమంది ప్రయత్నించారని.. కానీ.. కాంగ్రెస్ పార్టీ విభజన వాదాన్ని భుజాన మోస్తోందని చెప్పకనే చెప్పారు. తద్వారా.. పవన్ కల్యాణ్.. తన రాజకీయ ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీనేనని వెల్లడించడం గమనార్హం. దీనిని బట్టి రాబోయే రోజుల్లో జాతీయస్తాయి కావొచ్చు.. ప్రాంతీయ స్థాయి కావొచ్చు.. పవన్ వ్యూహం.. కాంగ్రెస్‌పైనే ఉంటుందన్న విషయం స్పష్టమవుతోంది.పవన్ వ్యాఖ్యలను నిశితంగా గమనిస్తే.. నిన్న మొన్నటి వరకు లేని ఉత్తేజం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటి వరకు ఆయన ఏపీకి, తెలంగాణకు పరిమితమైతే.. తొలిసారి దేశ ఐక్యత, సమగ్ర వ్యూహం.. అన్ని ప్రాంతాలు ఒక్కటేనన్న భావనను వినిపించారు. తద్వారా.. దేశంలోని తటస్థులను ఆయన ఆకర్షించే ప్రయత్నంలో ఉన్నారన్నది స్పష్టమవుతోంది. అయితే.. దీనివెనుక ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిశానిర్దేశం స్పష్టంగా కనిపిస్తోందని అంటున్నారు పరిశీలకులు. ఇది పవన్‌ను జాతీయ నేతగా తీర్చిదిద్దినా ఆశ్చర్యం లేదని అంటున్నారు.

# కర్ణాటక నుంచి అనంత...

## వేలాది కోట్ల రూపాయిల పెట్టుబడి

అనంతపురం, జూన్ 12,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలు లేకుండా అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికల్ని అమలు చేస్తోంది. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో అక్కడి పరిస్థితులకు అనుకూలంగా పరిశ్రమలు, కంపెనీలను తీసుకొస్తోంది. ఉత్తరాంధ్ర జిల్లాకు ఐటీ కంపెనీలు, డేటా సెంటర్లు, ఫార్మా పరిశ్రమలు వస్తున్నాయి. కోస్తా జిల్లాలలో సోలార్ ప్లాంట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఇతర పరిశ్రమలు, పర్యాటక రంగ అనుబంధ హోటల్స్, పోర్టుల్ని అభివృద్ధి చేస్తున్నారు. రాయలసీమ జిల్లాల్లో సోలార్ ప్లాంట్‌లు, డ్రోన్ సిటీ, డ్రోన్, ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్లు, సెమీ కండక్టర్ పరిశ్రమల్ని తీసుకొస్తున్నారు. ముఖ్యంగా రాయలసీమలో కరువు జిల్లాగా పిలిచే ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఇప్పటికే ఆటోమొబైల్, టెక్స్‌టైల్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు రాగా.. కొంతకాలంగా ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్లు వస్తున్నాయి. పొరుగునే ఉన్న కర్ణాటకను కాదని పుట్టపర్తి, హిందూపురం సహా పలు కీలక ప్రాంతాలకు పరిశ్రమలు వస్తున్నాయి.కర్ణాటకను కాదని ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఎన్నో అనుకూల అంశాలు ఉన్నాయి. ప్రధానంగా ఉమ్మడి అనంతపురం జిల్లా కర్ణాటకకు సరిహద్దులో ఉంది.. అక్కడితో పోలిస్తే అనంతపురం జిల్లాలో భూముల లభ్యత బావుంది. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఇండస్ట్రియల్ పాలసీతో పాటు అందిస్తున్న ప్రోత్సాహకాలు కూడా కలిసొస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సింగిల్ విండో విధానం ద్వారా పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను వేగంగా ఇవ్వడం ప్లస్ పాయింట్. బెంగళూరు ఎయిర్‌పోర్ట్ అనంతపురం జిల్లా సరిహద్దు నుంచి దగ్గరగా ఉంది.. కేవలం రెండు, మూడు గంటలు ప్రయాణం ఉంటుంది. బెంగళూరు ఎయిర్‌పోర్ట్ నుంచి హిందూపురం, పుట్టపర్తి జస్ట్ 2 గంటల్లో చేరుకోవచ్చు. అంతేకాదు పుట్టపర్తిలో ఎయిర్‌పోర్ట్ ఉండటం కూడా కలిసొస్తుంది.. ఇటు రోడ్డు, రైలు సౌకర్యాలు ఉండటం సానుకూలంగా మారింది. అందుకే పారిశ్రామికవేత్తలు పొరుగునే ఉన్న కర్ణాటక కాకుండా సమీంలోనే ఉన్న అనంతపురం జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారని చెబుతున్నారు.ఏపీ ప్రభుత్వం ముందుగానే ఉమ్మడి అనంతపురం జిల్లాలో భూముల్ని గుర్తించి పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తోంది. అందుకే పారిశ్రామికవేత్తలు అనంతపురం జిల్లావైపు మొగ్గు చూపుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిశ్రమల కోసం వేల ఎకరాల ప్రభుత్వ, బంజరు భూముల్ని గుర్తించారు. పారిశ్రామిక అవసరాల కోసం ప్రభుత్వం లేపాక్షి, మడకశిర పరిసరాల్లో వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్‌ను సిద్ధం చేసింది. కర్ణాటకతో పోలిస్తే ఇక్కడ భూముల ధరలు చాలా తక్కువ కావడంతో అనంతపురం జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. గతేడాది బెంగళూరులో ఉన్న ఐటీ కంపెనీ సీఈవో కష్టాలు చెప్పుకుంటూ ట్వీట్ చేశారు. మంత్రి లోకేష్ వెంటనే స్పందించి.. ఏపీకి రమ్మని ఆహ్వానించారు. ఆ తర్వాత మంత్రి లోకేష్ అనంతపురాన్ని కొత్త ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా పేర్కొన్నారు. ఏరోస్పేస్, ఇతర పరిశ్రమలకు ఏపీలో 8వేల ఎకరాల భూమి అందుబాటులో ఉందంటూ ఆహ్వానం పలికారు. లోకేష్ ఇచ్చిన పిలుపు కూడా పరిశ్రమల రాకకు ఓ కారణంగా చెప్పొచ్చు.ఇప్పటికే ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలు.. సోలార్, డ్రోన్ పరిశ్రమలు రాగా.. ఇటీవల కేంద్రం నుంచి వచ్చిన యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు ఈ ప్రాంతానికి మరింత బూస్టప్ ఇచ్చింది. ఏపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాను ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా తయారు చేయాలని ప్లాన్ చేస్తోంది.. రాబోయే రోజుల్లో మరికొన్ని పరిశ్రమలు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. గతంలో ఉద్యోగాలు, ఉపాధి కోసం బెంగళూరు, కర్ణాటక వెళ్లిన జిల్లా ప్రజలకు.. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసిన పరిశ్రమలు, కంపెనీలతో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. తాజాగా జిల్లాకు వరుసగా పరిశ్రమల రాకతో మరికొన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయంటున్నారు. ఇక జిల్లావాసులు ఉద్యోగం, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదంటున్నారు.ఉమ్మడి అనంతపురం జిల్లా భారీ పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. పెనుకొండలో కియా మోటార్స్ కార్ల తయారీ ప్లాంట్ ఉంది. కియాకు అనుబంధంగా మరికొన్ని అంతర్జాతీయ విడిభాగాలు (స్పేర్ పార్ట్స్) కంపెనీలు ఏర్పాటయ్యాయి. రాప్తాడు దగ్గర రేమండ్ గ్రూప్ రూ. 1,200 కోట్ల పెట్టుబడితో ప్లాంట్లు ఏర్పాటు చేయబోతోంది. హిందూపురం, పెనుకొండ ప్రాంతంలో ప్రముఖ ఇన్నర్ వేర్ బ్రాండ్ అయిన జాకీ తయారీ యూనిట్ వచ్చింది. సరళా ఏవియేషన్ రూ. 1300 కోట్లతో ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్, ల్యాండింగ్ విమానాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. అలాగే రక్షణ, విమాన పరికారల తయారీకి ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పార్క్ అభివృద్ధి చేయనున్నారు. గిన్‌ఫ్రా ప్రెసిషన్స్ రూ. 1,150 కోట్ల పెట్టుబడితో బైమాడ్యులర్ ఛార్జ్ సిస్టమ్స్ తయారీ యూనిట్‌ను తిమ్మసముద్రంలో ఏర్పాటు చేస్తోంది. అలాగే హిందూపురం ఇండస్ట్రియల్ ఏరియాలో ఆర్జాస్ స్టీల్ స్టీల్ ఉత్పత్తులను తయారు చేస్తోంది. పుట్టపర్తి సమీపంలో ఆర్‌ఆర్‌పీ ఎలక్ట్రానిక్స్ భారీ సెమీకండక్టర్ పరిశ్రమను ఏర్పాటు చేస్తోంది.పుట్టపర్తి సమీపంలో డ్రోన్, ఏరోస్పేస్, డిఫెన్స్ క్లస్టర్లు వస్తున్నాయి. గత నెలలోనే పుట్టపర్తిలో కేంద్ర ప్రభుత్వం ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమాన తయారీ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది. రూ. 15,803 కోట్లతో యుద్ధ విమాన తయారీ ప్రాజెక్టు ఏర్పాటు చేయబోతున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం ఏపీ ప్రభుత్వం 600 ఎకరాలను కేటాయించింది. ఈ స్టెల్త్ యుద్ధ విమాన తయారీ ప్రాజెక్టు ద్వారా దాదాపు 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెబుతున్నారు. ఈ ప్రాంతంలో దాదాపు రూ. లక్ష కోట్ల వరకు పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు. అనంతపురం జిల్లా రాబోయే రోజుల్లో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సంబంధించిన పరిశ్రమలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతుందని చెబుతున్నారు.

# కూటమికి 'కాపు గర్జన' సంకేతాలు!

విజయవాడ, జూన్ 12, ఏపీలో కాపులు ఇప్పుడు తెరపైకి వస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించేందుకు సిద్ధపడుతున్నారు. అందులో భాగంగా తూర్పుగోదావరిలో కాపుల మహా గర్జన జరిగింది. అయితే ఇది కూటమికి ఒక హెచ్చరిక లాంటిది. ప్రస్తుతం కాపులకు ఉన్న ఏకైక ఆప్షన్ కూడా కూటమి. ఎందుకంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని నమ్మేస్థితిలో కాపులు లేరు. ఒకసారి కాపులు ఆ పార్టీని నమ్మారు. జగన్మోహన్ రెడ్డి కొత్తగా ఏం చేయకపోగా.. కాపులకు సంబంధించి వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ పర్యవసానాలే ఆ పార్టీకి కాపులు దూరమయ్యారు. అప్పుడే వారంతా పవన్ కళ్యాణ్ వైపు టర్న్ అయ్యారు. అలా కూటమి వైపు అడుగులు వేశారు. అయితే ఇప్పుడు కూటమి పాలన రెండేళ్లు పూర్తవుతున్న తరుణంలో కాపులు తమ సమస్యలను పరిష్కరించాలని.. తమకు రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యమ బాట పడుతుండడం విశేషం.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విషయంలో కాపుల ఆలోచన మారే పరిస్థితి లేదు. ఎందుకంటే కాపుల రిజర్వేషన్లు అమలు చేయలేను అంటూ జగన్మోహన్ రెడ్డి తేల్చి చెప్పారు. అంతకుముందు చంద్రబాబు సర్కార్ ప్రవేశపెట్టిన ఐదు శాతం ఈ బి సి రిజర్వేషన్లను సైతం రద్దు చేశారు. ఆర్థికంగా వెసులుబాటు కల్పించే ఈ ఆర్థికపరమైన రిజర్వేషన్లను ఐదు శాతం ఇచ్చారు అప్పట్లో చంద్రబాబు. కానీ నేరుగా రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని ముద్రగడ పద్మనాభం పెద్ద ఉద్యమమే చేపట్టారు. అయితే అది రాజకీయ ప్రేరేపిత ఉద్యమమని తదనంతర పరిణామాల్లో తెలుసుకున్నారు కాపులు. అదే ముద్రగడ రాజకీయ ప్రేరేపితంలో భాగంగానే చేశారని ఆయన వైసీపీలోకి వెళ్లిన తర్వాత అర్థం అయింది. అయితే ఇప్పుడు కాపులు ఆర్థికపరమైన రిజర్వేషన్లు ఇచ్చిన కొంతవరకు సంతృప్తి పడే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం అది నెరవేర్చే ఛాన్స్ కూడా కనిపిస్తోంది.ప్రస్తుతం జరుగుతున్న కాపుల ఆందోళన కార్యక్రమాల్లో ఒక అర్థం ఉంది. దానిని అర్థం చేసుకునే పనిలో ఉంది కూటమి ప్రభుత్వం. గత మాదిరిగా ఈ బీసీ రిజర్వేషన్లు ఇస్తే మిగతా సామాజిక వర్గాలు వ్యతిరేకించే అవకాశం లేదు. అయితే గతసారి ఐదు శాతం ఇచ్చారు. ఈసారి మాత్రం 10% ఈ బీసీ రిజర్వేషన్లు ఇవ్వచ్చు. ఆపై నామినేటెడ్ పోస్టులతో పాటు రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవుల్లో కాపులకు సింహభాగం ప్రయోజనాలు కల్పించవచ్చు. ఒకవైపు సామాజిక వర్గానికి ఆర్థికపరమైన పథకాలు కూడా అందించవచ్చు. సామాజిక వర్గ నేతలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచవచ్చు. మరి ఇంతకంటే ఏం చేయగలరు. అయితే వైసీపీలో ఉన్న కాపు నేతలు.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్లేవర్ ఉన్న నేతల ప్రకటనలకు భిన్నంగా.. కూటమిని అలెర్ట్ చేసేందుకే ఈ కాపు గర్జనలు అని స్పష్టమవుతోంది. అయితే దీనిని మేల్కొని కూటమి ప్రభుత్వం కాపుల అభిమానాన్ని చూరగుంటే వైసిపి చేసే ప్రయత్నాలు ఏవి ఫలించవు కూడా.

# అంతుపట్టని జేసీ వ్యూహం


అనంతపురం, జూన్ 12,తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి ఏదీ మనసులో దాచుకోరు. మైకులో ఉన్నది ఉన్నట్లు చెప్పేస్తారు. ప్రత్యర్థులకు వార్నింగ్ లు ఇచ్చినా, తమ పార్టీ నేతలకు ఆదేశాలు ఇచ్చినా అన్నీ ఓపెన్ గానే ఉంటాయి. ఏదీ గుట్టుగా చేయరు. రహస్య ఆదేశాలు ఇవ్వరు. జేసీ ప్రభాకర్ రెడ్డి స్టయిల్ అంతే. అందుకే తరచూ వివాదాల్లోకి జేసీ కూరుకుపోతుంటారు. అయినా లెక్కచేయరు. సొంత పార్టీతో పాటు ప్రత్యర్థులను కూడా ఆయన కేర్ చేయరు. తనకు తాడిపత్రి మినహా మరొకటి అవసరం లేదన్నట్లు ఆయన వ్యవహార శైలి కొనసాగుతుంది. అసభ్య పదజాలంతో ప్రత్యర్థులను దూషించడంలోనూ ఆయనకు ఆయనే సాటి.తాజాగా వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పై మాటల దాడి చేశారు. ఇంటికి వచ్చి నరుకుతా అంటూ ఓపెన్ గా మైకులోనే జేసీ ప్రభాకర్ రెడ్డి హెచ్చరించడం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దీంతో పాటు కేతిరెడ్డిపై వ్యక్తిగత దూషణలు చేయడం కూడా పార్టీకి ఇబ్బందికరంగా మారాయి. అయితే జేసీ ప్రభాకర్ రెడ్డి ఎమ్మెల్యే కాదు. ప్రస్తుతం మున్సిపల్ ఛైర్మన్ కూడా కాదు. కానీ నియోజకవర్గంలో తాను చెప్పిందే జరగాలన్నది ఆయన ఆకాంక్ష. అందుకు పోలీసులయినా.. ప్రత్యర్థులయినప్పటికీ ఎవరినీ వదలిపెట్టరు. అదే ఇప్పుడు పార్టీకి తలనొప్పిగా మారింది. దీంతో పాటు అంతకు ముందు ఆయన చేసిన హెచ్చరికలు కూడా సోషల్ మీడియాలో వైసీపీ నేతలు వైరల్ చేస్తున్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ నేతల చేత నామినేషన్లను కూడా వేయించకుండా అడ్డుకోమని బహిరంగంగానే తన పార్టీ నేతలకు జేసీ ప్రభాకర్ రెడ్డి పిలుపు నిచ్చారు. నామినేషన్లు వేస్తే అడ్డుకోవాలని, అంతకు ముందే వారి ఇళ్లకు వెళ్లి వార్నింగ్ ఇవ్వమని చెప్పడంతో జేసీ అనుచరులు వైసీపీ నేతల ఇళ్లకు వెళ్లి హంగామా చేసి వచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తమను గెలవకుండా అడ్డుకున్నారని, పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించారని జేసీ ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో తమను స్వేచ్ఛగా ఓటు వేసుకునేందుకు కూడా అవకాశం కల్పించలేదని అన్నారు. ఇప్పడు ఆ బాధ వారికి రుచిచూపించాలని పిలుపు నివ్వడం చర్చనీయాంశమైంది. దీంతో జేసీ ప్రభాకర్ రెడ్డి పదే పదే చేసిన వ్యాఖ్యలు పార్టీకి తలనొప్పిగా మారాయి.

# బైరెడ్డి ప్లాన్ సక్సెస్...

కర్నూలు, జూన్ 12, కర్నూలు జిల్లాకు చెందిన బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమయినట్లు కనిపిస్తుంది. అందుకే టీడీపీ నేతలపై కాలుదువ్వుతున్నారు. మంత్రి టీజీ భరత్ పై ఆరోపణలు చేసి వివాదాన్ని కొని తెచ్చుకున్నారు. వివాదాలతో మరింత హైలెట్ అవుదామని బైరెడ్డి భావించి ఉండవచ్చు. అనుకున్న మైలేజీ వస్తుందని అనుకుని ఉండవచ్చు. అందుకే టీజీ భరత్ పై అవినీతి ఆరోపణలు చేసి గత కొన్ని రోజులుగా మీడియాలో హైలెట్ అయ్యారు. దీంతో బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అనుకున్న గమ్యానికి చేరుకున్నట్లయింది. అయితే ఆయన వచ్చే ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేస్తారన్నది స్పష్టం చేయకపోయినా ఈసారి మాత్రం ఖచ్చితంగా పోటీ చేయాలని భావిస్తున్నారు.బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఇప్పటి వరకూ ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొనలేదు. నందికొట్కూరు నుంచి ఆయన 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిని గెలిపించడంలో కీలక భూమిక పోషించినప్పటికీ అది రిజర్వడ్ నియోజకవర్గం. ఒకవేళ నియోజకవర్గాల పునర్విభజనలో నందికొట్కూరు జనరల్ నియోజకవర్గంగా మారితే అక్కడి నుంచే పోటీ చేసే అవకాశాలున్నాయి. 2004 వరకూ నందికొట్కూరు నియోజకవర్గం జనరల్ లోనే ఉంది. 2009 నియోజకవర్గ పునర్విభజనలో ఎస్.సి. రిజర్వ్‌డ్ నియోజకవర్గంగా మారింది. అక్కడ ఒకసారి కాంగ్రెస్, రెండు సార్లు వైసీపీ, ఒకసారి టీడీపీ గెలిచింది. అంతకు ముందు జనరల్ నియోజకవర్గంగా ఉన్నప్పుడు కూడా టీడీపీ మూడు సార్లు మాత్రమే గెలిచింది. కాంగ్రెస్ ఎక్కువ సార్లు గెలిచిన నియోజకవర్గం. అయితే డీలిమిటేషన్ లో మార్పు జరగకపోతే ఆయన కర్నూలు నుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారంతాజాగా బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, మంత్రి టీజీ భరత్ మధ్య తీవ్రమైన రాజకీయ విభేదాలు, వివాదాలు కొనసాగుతున్నాయి.కర్నూలు జిల్లాలోని ఒక ఫార్మా కంపెనీ వద్ద మంత్రి టీజీ భరత్ రూ.45 కోట్లు వసూలు చేశారని, భూకబ్జాలకు పాల్పడ్డారని బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి బహిరంగ సభల్లో తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో టీజీ భరత్ తనపై, తన కుటుంబంపై బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేసి పరువుకు భంగం కలిగించారంటూ కర్నూలు త్రీ-టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ పరువు నష్టం దావా కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి పోలీసు విచారణకు కూడా హాజరయ్యారు.

# అక్షయ పాత్రలా మారిన టీటీడీ నిత్యాన్నదానం


తిరుమల జూన్ 12, తిరుమల శ్రీవారి భక్తులకు టీటీడీ నిత్యాన్నదాన కార్యక్రమం అక్షయ పాత్రలా మారింది. అన్నప్రసాద సేవ 15.8 టన్నుల బియ్యంతో నిత్యం మహాయజ్ఞంలా కొనసాగుతోంది. రోజుకు దాదాపు 3 లక్షల మందికి అన్నప్రసాదం అందిస్తున్నారు. 2026 జనవరి నుంచి మే వరకు 4.40 కోట్లకు పైగా సర్వింగ్స్ చేశారు. ఆధునీకరణతో విస్తరిస్తున్న అన్న ప్రసాద సేవలు నిర్వహిస్తున్నారు. అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.2,460 కోట్ల ఫిక్సడ్ డిపాజిట్లు ఉన్నాయి.తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి నిత్యం వచ్చే భక్తులకు టీటీడీ శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ ద్వారా ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిత్యం మహాయజ్ఞంలా నిర్వహిస్తోంది. నిత్యం దేశ విదేశాల నుంచి తిరుమలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని టీటీడీ ఉచితంగా అందిస్తోంది. తిరుమలలో 1985 ఏప్రిల్ 6న ప్రారంభమైన నిత్య అన్నదాన పథకం ప్రస్తుతం శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతోంది. తిరుమలలో సాధారణ రోజుల్లో సుమారు 1.80 లక్షల నుంచి 1.90 లక్షల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరిస్తారు.. అదే వీకెండ్ అయితే 3 లక్షలకు మించి భక్తులు ఉంటారు.శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం



ట్రస్ట్ భక్తుల విరాళాలతో నిర్వహిస్తున్నారు. టీటీడీ దగ్గర ప్రస్తుతం రూ.2,500 కోట్లకు పైగా ఫిక్సడ్ డిపాజిట్లు ఉన్నాయి. ఈ నిధుల ఆదాయంతో లక్షలాది మంది భక్తులకు నిత్యం ఉచితంగా నాణ్యమైన భోజనం అందిస్తోంది. శ్రీవారి సన్నిధిలో ఆకలితో వచ్చే ప్రతి భక్తునికి తృప్తికరమైన భోజనం అందించడం ద్వారా టీటీడీ అన్నప్రసాద సేవలు ప్రపంచవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తున్నాయి. టీటీడీ భక్తులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు రోజుకు సుమారు 15,788 కిలోల బియ్యం వినియోగిస్తోంది. 3,110 కిలోల సన్‌ఫ్లవర్ ఆయిల్, 2,861 కిలోల కందిపప్పు, 1,729 కిలోల మినపప్పు, 1,436 కిలోల ఉప్పు, 1,276 కిలోల బెల్లం, 2,832 కిలోల సుజీ రవ్వ, 2,825 కిలోల గోధుమ రవ్వ, 497 కిలోల చింతపండు వినియోగిస్తున్నారు. రోజుకు 430 కిలోల చక్కెర, 309 కిలోల ఎండు మిర్చి, 4,375 కొబ్బరికాయలు, 209 కిలోల ధనియాలు వంటి ముడి పదార్థాలు ఉపయోగిస్తున్నారు మూడు నెలలుగా చూస్తే.. రోజుకు దాదాపు 70 వేల మందికి పాలు, టీ, కాఫీ వంటివి టీటీడీ భక్తులకు అందిస్తోంది. అలాగే 60,200 మందికి అల్పాహారం, 99,500 మందికి మధ్యాహ్న భోజనం, 56,700 మందికి రాత్రి భోజనం అందిస్తున్నారు. ఇలా చూస్తే రోజుకు దాదాపు 3 లక్షల సర్వింగ్స్ భక్తులకు అందుతున్నాయి. తిరుమలలోని వివిధ అన్నప్రసాద కేంద్రాల ద్వారా 2026 జనవరి 1 నుంచి మే 31 వరకు మొత్తం 4.40 కోట్ల సర్వింగ్స్ భక్తులకు అందించినారు. ఇందులో జనవరిలో కోటి, ఫిబ్రవరిలో 71.39 లక్షలు, మార్చిలో 84.85 లక్షలు, ఏప్రిల్‌లో 85 లక్షలు, అలాగే మే నెలలో 92 లక్షలకు పైగా భక్తులకు అన్నప్రసాదం, అల్పాహారం, పానీయాలు అందించారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో రోజుకు 82 వేల మందికి పైగా భోజనాలు అందిస్తున్నారు. శ్రీ అక్షయ కిచెన్, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కాంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు, క్యూ లైన్ల బయట ఏర్పాటు చేసిన కేంద్రాలు, ఖంఅ అన్నప్రసాద భవనాలతో పాటుగా ఆయా ప్రాంతాల్లో లక్షలాది మంది భక్తులకు ఆహారం, పానీయాలు అందిస్తున్నారు.

# జాతీయస్థాయిలో పవన్ ...

కాకినాడ, జూన్ 12, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన జనసేన పార్టీ, ఇప్పుడు జాతీయ రాజకీయాల వైపు అడుగులు వేస్తోంది. దేశ రాజధాని ఢిల్లీ వేదికగా ఈ నెల 14 నుండి 16 వరకు మూడు రోజుల పాటు జనసేన పార్టీ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనుంది. పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వయంగా ఈ సమావేశాలకు హాజరై దిశానిర్దేశం చేయనున్నారు. ప్రాంతీయ పార్టీగా ఉన్న జనసేన సిద్ధాంతాలను, భావజాలాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు



ఈ పర్యటనను ఒక వేదికగా మలుచుకోనున్నారు.ఈ పర్యటనలో అత్యంత కీలకమైన అంశం సేన గళం . సమాజంలో బాధ్యతాయుతమైన రాజకీయ సంస్కృతిని పెంపొందించడం, కుల రాజకీయాలకు అతీతంగా అభ్యుదయ భావాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా పవన్ కల్యాణ్ ఇటీవలే ఈ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా నేటి తరం యువత జెన్ జీ ఆకాంక్షలకు అనుగుణంగా, రాజ్యాంగ విలువల పరిరక్షణే ధ్యేయంగా ఈ సేన గళం పనిచేయనుంది. ఈ వేదిక ముఖ్య ఉద్దేశాలు, ఆశయాలను జాతీయ మీడియా ద్వారా దేశ ప్రజలకు పవన్ కల్యాణ్ వివరించనున్నారు.ఢిల్లీ పర్యటన కోసం జనసేన పార్టీకి చెందిన సుమారు 150 మంది ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల అధ్యక్షులు తరలివెళ్లనున్నారు.

# కాఫీ , టీ...ఈ రెండింటిలో ఏది ఆరోగ్యానికి మంచిదో తెలుసా..?



ప్రపంచవ్యాప్తంగా కోట్ల మందికి ఉదయం లేవగానే కావాల్సింది ఒక కప్పు వేడివేడి పానీయం. కొందరు కాఫీ లేకుండా రోజు మొదలుపెట్టలేరు, మరికొందరు టీ తో రోజుకు శ్రీకారం చుడతారు. అయితే, ఈ రెండు పానీయాల్లో ఆరోగ్యానికి ఏది ఎక్కువ ప్రయోజనకరమైనది? ఈ ప్రశ్న తరచుగా చర్చకు వస్తుంది. రెండింటికీ వాటివైన ప్రత్యేకతలు, ఆరోగ్య ప్రయోజనాలు, కొన్ని పరిమితులు ఉన్నాయి. వాటిని లోతుగా పరిశీలిద్దాం. కాఫీ: కెఫిన్ ఏకాగ్రతను పెంచి, అలసటను తగ్గిస్తుంది. వ్యాయామం చేసే ముందు కాఫీ తాగడం వల్ల శారీరక పనితీరు మెరుగుపడుతుంది.కాఫీలో క్లోరోజెనిక్ యాసిడ్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి శరీర కణాలను ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి.టైప్ 2 డయాబెటిస్, పార్కిన్సన్ వ్యాధి, లివర్ వ్యాధులు, కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించడంలో కాఫీ సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.పరిమితులు: సాయంత్రం వేళల్లో లేదా నిద్రకు ముందు కాఫీ తాగితే నిద్రకు భంగం కలగవచ్చు.అధిక కెఫిన్ ఆందోళన, గుండె దడకు కారణం కావచ్చు. కొంతమందికి కాఫీ వల్ల ఎసిడిటీ లేదా కడుపులో మంట రావచ్చు. టీ: టీలో ముఖ్యంగా గ్రీన్ టీ, బ్లాక్ టీలలో ఫ్లేవనాయిడ్లు, కేటెచిన్లు వంటి యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి, ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి, కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఎల్-థియానిన్ ఒత్తిడిని తగ్గించి, మెదడులో ఆల్ఫా తరంగాలను పెంచి ప్రశాంతతను కలిగిస్తుంది. టీ క్రమం తప్పకుండా తాగడం వల్ల గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదం తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. టీలోని కొన్ని సమ్మేళనాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. పరిమితులు: భోజనంతో పాటు టీ తాగితే శరీరంలో ఐరన్ శోషణకు ఆటంకం కలగవచ్చు. తక్కువ మొత్తంలో ఉన్నప్పటికీ, కొంతమందికి టీలోని కెఫిన్ కూడా నిద్రలేమికి కారణం కావచ్చు. నిజానికి, ఏది "మంచిది" అనేది మీ వ్యక్తిగత ఆరోగ్య లక్ష్యాలు, సున్నితత్వంపై ఆధారపడి ఉంటుంది.మీరు తక్షణ ఉత్సాహం, ఏకాగ్రత కోరుకుంటే, కాఫీ మంచి ఎంపిక.మీరు ప్రశాంతత, దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలు, తక్కువ కెఫిన్ కోరుకుంటే, టీ ఉత్తమమైనది. చివరి మాట: రెండూ కూడా మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి ప్రయోజనకరమైనవే. చక్కెర, క్రీములు లేదా పాలు ఎక్కువగా కలపకుండా ఉండటం ముఖ్యం, ఎందుకంటే ఇవి వాటి ఆరోగ్య ప్రయోజనాలను తగ్గించవచ్చు. మీ ఆరోగ్య అవసరాలు, రుచి ప్రాధాన్యతలను బట్టి మీ రోజువారీ పానీయాన్ని ఎంచుకోండి. గుర్తుంచుకోండి, ఆరోగ్యం అనేది కేవలం ఒక పానీయంపై ఆధారపడి ఉండదు, సమతుల్య ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, తగినంత నిద్ర కూడా అవసరం!

# వయసు పెరిగినా కంటి చూపు తగ్గకుండా ఉండాలా.. ఈ చిట్కాలు పాటించండి



వయసు పెరిగే కొద్దీ మన కంటి చూపు మందగిస్తుంటుంది. ముఖ్యంగా సమీప వస్తువులు స్పష్టంగా కనపడకపోవడం, కంటి శుక్లం , రెటీనా మధ్య భాగం దెబ్బతినడం వంటివి సాధారణంగా వృద్ధాప్యంలో వచ్చే సమస్యలు. ఇంకా మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులు కూడా కంటి ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. అయితే, కొన్ని అలవాట్లు పాటిస్తే వృద్ధాప్యం వచ్చినా కంటి చూపును కాపాడుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..పోషకాల ఆహారంవిటమిన్ ం, అ, ఇ, ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు, అలాగే పోషకాలు ఉన్న ఆహారాలు కంటికి చాలా ఉపయోగపడతాయి. ఈ పోషకాలు ఆక్సిడేషన్ (శరీరంలో హాని కలిగించే ప్రాసెస్)ను తగ్గించి, రెటీనా ఆరోగ్యాన్ని కాపాడతాయి. అందుకే ఆకుకూరలు, చేపలు, క్యారెట్, గింజలు ఎక్కువగా తినడం మంచిది.నీరు తగినంత నీరు తాగితే కళ్ళు తేమగా ఉంటాయి. ఇది డ్రై ఐ సిండ్రోమ్ (కళ్ళు ఎండిపోయి అసౌకర్యం కలిగించటం)ను తగ్గిస్తుంది. ఇది వృద్ధాప్యంలో చాలా సాధారణం. కాబట్టి, ఎక్కువగా నీరు తాగుతూ ఆరోగ్యంగా ఉండండి.స్క్రీన్ ఎక్కువగా చూడండి కంప్యూటర్, ఫోన్ స్క్రీన్ ఎక్కువగా చూస్తే కళ్ళు అలసిపోతాయి. అందుకే 20-20-20 నియమం పాటించండి. అంటే ప్రతి 20 నిమిషాలకి 20 అడుగుల దూరంలో ఉన్న దేనినైనా 20 సెకన్ల పాటు చూడండి. ఇది కంటి ఒత్తిడిని తగ్గిస్తుంది.ఎ వ్యాధులను నియంత్రించండి మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులను నియంత్రించండి. ఈ వ్యాధులు కంటి రక్తనాళాలకు హాని కలిగించి చూపు కోల్పోవడానికి కారణం అవుతాయి. కాబట్టి మీ చక్కెర, రక్తపోటును తరచూ తనిఖీ చేయించుకుని డాక్టర్ చెప్పిన మందులు సరిగా తీసుకోండి.సరైన వెలుతురు పుస్తకం చదవడం, పని చేయడం వంటి వాటికి తగినంత వెలుతురు ఉండాలి. తక్కువ వెలుతురులో పని చేస్తే కళ్ళ మీద ఒత్తిడి పెరుగుతుంది. కాబట్టి, వెలుతురు ఉన్న ప్లేస్‌లో పని చేయండి.వ్యాయామం చేయండి శరీరం ఆరోగ్యంగా ఉండటం కంటి ఆరోగ్యానికి కూడా మంచిది. అలాగే కంటికి సంబంధించిన కొన్ని ప్రత్యేక వ్యాయామాలు కూడా చేయడం వల్ల కంటి శక్తి మెరుగుపడుతుంది. మొత్తానికి, పాటిస్తే వయసు పెరిగినా మీ కంటి చూపును దెబ్బతీయకుండా రక్షించుకోవచ్చు.

# ఈ 5 హెర్బల్ డ్రింక్స్ తాగడం వల్ల బరువు తగ్గవచ్చు..



ఈ రోజుల్లో చాలా మంది ఫిట్‌గా ఉండాలని కోరుకుంటున్నారు. అందుకోసం కొంతమంది జిమ్‌కి వెళ్తుంటే, ఇంకొందరు డైటింగ్ చేస్తుంటారు. కానీ ఇంట్లోనే ఉన్న కొన్ని ఆహార పదార్థాలతో తయారయ్యే కొన్ని పానీయాలు కూడా బరువు తగ్గించడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. సరైన ఆహారం, వ్యాయామం తోపాటు వీటిని తిసుకుంటే ఆరోగ్యంగా ఉండటమే కాకుండా, బరువు తగ్గవచ్చని అంటున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..నిమ్మకాయ నీరు నిమ్మకాయ నీరు ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఉన్న విటమిన్ అ శరీరంలో జీవక్రియను మెరుగుపరుస్తుంది. రోజుకోసారి, ఉదయాన్నే ఖాళీ కడుపుతో నిమ్మకాయ నీరు తాగితే బరువు తగ్గుతారని నిపుణులు చెబుతున్నారు.తేనె కలిపిన నిమ్మకాయ నీరు నిమ్మకాయ నీటిలో తేనె కలిపి తాగితే మంచి ఫలితం ఉంటుంది. ముఖ్యంగా రాత్రి భోజనం తరువాత తాగితే ఇది జీర్ణక్రియను మెరుగుపరచి, బరువు తగ్గించడంలో సహాయపడుతుంది.కొత్తమీర నీరు కొత్తమీర నీరు ఆకలిని నియంత్రించడంలో, జీర్ణాన్ని మెరుగుపరచడంలో ఉపయోగపడుతుంది. ఒక కప్పు నీటిని మరిగించి అందులో కొత్తమీర వేసి 10 నిమిషాలు మరిగించాలి. తర్వాత ఫిల్టర్ చేసుకొని తాగవచ్చని నిపుణులు చెబుతున్నారు.దాల్చిన చెక్క నీరు దాల్చిన చెక్క శరీరంలో చక్కెర స్థాయిని సమతుల్యంలో ఉంచుతుంది. రాత్రి పడుకునే ముందు ఈ నీటిని తాగితే శరీరంలో మేలైన మార్పులు వస్తాయి. ముఖ్యంగా బరువు తగ్గడంలో సహాయపడుతుంది.జీలకర్ర నీరు జీలకర్ర నీరు శరీరానికి చాలా మంచిది. ఇది టాక్సిన్స్‌ను బయటికి పంపిస్తుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో తాగితే మంచి ఫలితం ఉంటుంది. బరువు తగ్గడానికీ సహాయపడుతుంది.

# పాలు.. పండ్లు కలిపి తింటున్నారా.. ఈ ముఖ్యమైన విషయాలు తెలుసుకోండి..




పాలలో ప్రోటీన్, కాల్షియం వంటి అనేక ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. మరోవైపు పండ్లలో ఫైబర్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కానీ ఈ రెండింటినీ కలిపి తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదేనా? ఈ విషయంపై నిపుణులు ఏం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం..పాలు.. పండ్లు కలిపి తింటున్నారా.. ఈ ముఖ్యమైన విషయాలు తెలుసుకోండి..పాలు, పండ్లు రెండూ ఆరోగ్యానికి మంచివే. పాలలో ప్రోటీన్, కాల్షియం, విటమిన్లు ఉంటాయి. అలాగే పండ్లలో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు ఉన్నాయి. కానీ ఈ రెండింటినీ కలిపి తినడం ఆరోగ్యానికి మంచిదేనా? ఈ విషయంపై నిపుణులు ఏం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం..జీర్ణ సమస్యలు పండ్లు త్వరగా జీర్ణమవుతాయి. కానీ పాలు జీర్ణం కావడానికి టైం పడుతుంది. ఈ రెండూ కలిపి తింటే, జీర్ణక్రియ మందగిస్తుంది. ఫలితంగా కొంతమందికి కడుపు ఉబ్బరం, గ్యాస్, అసౌకర్యం కలగొచ్చు. కాబట్టి, ఈ రెండింటినీ కలిపి తినడం ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు.విష పదార్థాలు ఆయుర్వేదం ప్రకారం, పుల్లని పండ్లు (నారింజ, స్ట్రాబెర్రీలు వంటివి) పాలతో కలిపి తినడం మంచిది కాదు. ఈ రెండింటినీ కలిపి తినడం వల్ల శరీరంలో విష పదార్థాలుగా మారుతాయి. దీని వలన అలసటగా అనిపించడం, రోగనిరోధక శక్తి తగ్గిపోవడం వంటి సమస్యలు కూడా వస్తాయి.చర్మ సమస్యలుపాలు పండ్లూ కలిపి తినడం వల్ల జీర్ణం సరిగా కాకపోతే, ముఖంపై మొటిమలు, దద్దుర్లు, చర్మం ఉప్పగా మారటం వంటి సమస్యలు రావచ్చు. కాబట్టి, వీటిని ఎప్పుడూ కలిపి తినకూడదు.ఏం చేయాలి?పాలు, పండ్లను వేర్వేరుగా తినడం మంచిది. మధ్యలో కనీసం 30 నిమిషాల గ్యాప్ ఉండాలి.కలిపి తినాలంటే మామిడి లేదా అరటిపండ్లతో పాలను తీసుకోవచ్చు.పాలను బాగా మరిగించి, చల్లబర్చిన తర్వాత తీసుకుంటే మంచిది.పాలూ, పండ్లూ ఆరోగ్యానికి మంచివే కానీ కలిపి తినేటప్పుడు జాగ్రత్త అవసరం.

# పాలను ఇలా మరిగిస్తే.. ఆరోగ్యానికి ముప్పు తప్పదు..



పాలు ఆరోగ్యానికి మంచివి. వీటిని ఎక్కువగా మరిగించి తాగుతారు. అయితే, పొరపాటున కూడా ఈ లోహపు పాత్రలలో పాలు మరిగించడం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే పాలు విషపూరితంగా మారే అవకాశం ఉందని అంటున్నారు.నేటి కాలంలో ప్రజలు తమ ఇళ్లలో రాగి, ఇత్తడి వంటి అనేక రకాల లోహ పాత్రలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. అయితే, పొరపాటున కూడా ఈ పాత్రలలో పాలు మరిగించడం మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే పాలు విషపూరితంగా మారే అవకాశం ఉందని చెబుతున్నారు. పాలను ఏ పాత్రలలో మరిగించడం ప్రమాదకరమో, ఏ పాత్రలలో మరిగించడం సురక్షితమో ఇప్పుడు తెలుసుకుందాం..రాగి పాత్రలు రాగి పాత్రలో నిల్వ చేసిన నీరు తాగడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. కానీ పాలు లేదా పాల ఉత్పత్తులను పొరపాటున కూడా రాగి పాత్రలో ఉడికించకూడదు లేదా నిల్వ చేయకూడదు. పాలను రాగిలో వేడి చేసిన వెంటనే, అది పాలలో కరగడం ప్రారంభమవుతుంది. దీనివల్ల పాలు విషపూరితంగా మారుతాయి. ఇత్తడి పాత్రలు ఇత్తడి పాత్రలు చాలా మందికి సంప్రదాయంగా ఇష్టమైనవే. కానీ ఇందులో లోపలి పొర (టిన్ లైనింగ్) లేకపోతే, దాని లోహం నేరుగా పాలతో రియాక్ట్ అవుతుంది. దీని వల్ల పాలు త్వరగా పాడవుతాయి. ఆరోగ్యానికి హానికరంగా మారుతాయి.అల్యూమినియం పాత్రలు అల్యూమినియం పాత్రలు రోజువారీ వంటలో ఎక్కువగా వాడతారు. కానీ ఇందులో ఎక్కువసేపు పాలు మరిగిస్తే అల్యూమినియం పాలలోకి చేరి అది తినేవారికి నెమ్మదిగా నష్టాన్ని కలిగిస్తుంది. ఇది అల్జీమర్స్ వంటి మెదడు సంబంధిత సమస్యలకు కారణమవుతుందని నిపుణులు చెబుతున్నారు. నాణ్యత లేని స్టీల్ పాత్రలు చౌకగా దొరికే స్టీల్ పాత్రలు ఫుడ్ గ్రేడ్ కాకపోతే అందులో ఉండే లోహాలు వేడికి లొంగి పాలలోకి కలిసే ప్రమాదం ఉంది. దీని వల్ల పాలు విషపూరితంగా మారుతాయి. గాజు పాత్రలు గాజు రసాయనాలతో రియాక్ట్ కావు. అందుకే గాజు పాత్రలలో పాలను ఉడికించడం పూర్తిగా సురక్షితం. కానీ గాజు పగిలే అవకాశం ఎక్కువగా ఉండటం వల్ల జాగ్రత్తగా వాడాలి.స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు అధిక నాణ్యత గల స్టెయిన్‌లెస్ స్టీల్ పాలను మరిగించడానికి చాలా సురక్షితమైనది. ఇది మానవ ఆరోగ్యానికి హాని కలిగించదు, వాడటానికి కూడా సులభంగా ఉంటుంది.

# ఈ పువ్వు మధుమేహ వ్యాధిగ్రస్తులకు దివ్య ఔషధం..



డయాబెటిస్ అనేది ఒక సాధారణ ఆరోగ్య సమస్య. ఈ వ్యాధిని మధుమేహం లేదా షుగర్ వ్యాధి అని కూడా అంటారు. రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉంటాయి. ఇది సాధారణంగా ప్యాంక్రియాస్ సరిగ్గా ఇన్సులిన్ ఉత్పత్తి చేయలేకపోవడం వల్ల లేదా శరీరం ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించలేకపోవడం వల్ల వస్తుంది. నేటి కాలంలో చిన్న పిల్లలు మొదలుకుని పెద్దలవరకు చాలా మంది ఈ చక్కెర వ్యాధితో బాధపడుతున్నారు. దీని కోసం కొంతమంది మందులు వాడతారు. మరికొందరు ఇన్సులిన్ తీసుకుంటారు. కానీ, అరటి పువ్వు డయాబెటిస్‌కు ఒక అద్భుతంలా పనిచేస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.అరటి పువ్వు మధుమేహానికి దివ్య ఔషధమని అంటున్నారు. దీని నుండి అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని చెబుతున్నారు. అరటి పువ్వులు రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను స్థిరంగా ఉంచుతాయని, దీనిలోని ఫైబర్ ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తుందని అంటున్నారు. దీని కారణంగా రక్తంలో చక్కెర స్థాయిలు సమతుల్యంగా ఉంటాయని చెబుతున్నారు.అరటి పువ్వులో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని నివారిస్తాయి. దీనివల్ల దీర్ఘకాలిక వ్యాధులు కూడా తగ్గుతాయి. అరటి పువ్వులో మెగ్నీషియం చాలా సమృద్ధిగా ఉంటుంది. మెగ్నీషియం మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. ఇందులో విటమిన్ బి6 కూడా ఉంటుంది. ఇవి మహిళల్లో రుతుక్రమ సమస్యలను నివారించి ఆరోగ్యాన్ని కాపాడతాయి. అంతేకాకుండా, ఇందులో ఉండే విటమిన్లు ఎ, సి, పోషకాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. కాలానుగుణ వ్యాధులను నివారిస్తాయి. ఇది శరీరంలో కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది.

# ఉదయాన్నే ఇవి తింటున్నారా.. జాగ్రత్త..

ఉదయాన్నే అల్పాహారం తినడం ఆరోగ్యానికి చాలా ముఖ్యం. ఆరోగ్యకరమైన అల్పాహారంతో మీ రోజును ప్రారంభించాలి. సరైన పోషకాలు లేని అల్పాహారం తీసుకుంటే రోజంతా అలసటగా ఉంటుంది. ఆరోగ్యంపై చెడు ప్రభావం పడుతుంది. కాబట్టి, అల్పాహారంను సమతుల్యంగా ఎంచుకోవాలి. అలా కాకుండా ఉదయాన్నే వీటిని తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..పాలతో తృణధాన్యాలు చాలా మంది పాలలో తృణధాన్యాలు వేసుకోని తింటుంటారు. వీటిని ఆరోగ్యానికి మంచివిగా భావిస్తారు. కానీ ఇలా తినడం మంచిది కాదు. ఎందుకంటే తృణధాన్యాలలో చక్కెర ఉంటుంది. ఇది శరీరంలో చక్కెర స్థాయిని ఒక్కసారిగా పెంచేస్తుంది. దీని వల్ల త్వరగా ఆకలేస్తుంది, అంతే కాదు దీర్ఘకాలంలో మధుమేహం వచ్చే ప్రమాదం కూడా ఉంటుంది.బ్రెడ్ చాలామంది బ్రెడ్ మంచిదని అల్పాహారంగా దీనిని తీసుకుంటుంటారు. కానీ, ఇది జీర్ణ సమస్యలను తెస్తుంది. బ్రెడ్ ఎక్కువగా ప్రాసెస్ చేయబడిన కార్బోహైడ్రేట్ కాబట్టి ఇది కడుపులో గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు తలెత్తేలా చేస్తుంది. పైగా దీన్ని తిన్న తర్వాత త్వరగా ఆకలేస్తుంది.బాగెల్స్ బాగెల్స్ కూడా ప్రాసెస్ చేసిన పిండితో తయారవుతాయి. వీటిలో ఫైబర్ లేకపోవడంతో శరీరానికి అవసరమైన పోషకాలు అందవు. అల్పాహారంగా తింటే రక్తంలో చక్కెర మితిమీరినంతగా పెరగొచ్చు. దాంతో పాటు రోజంతా మళ్లీ మళ్లీ తినాలనిపిస్తుంది.ఫ్రూట్ జ్యూస్ చాలా మంది అల్పాహారంగా ఫ్రూట్ జ్యూసులు తీసుకుంటారు. అయితే, చాలా పండ్ల రసాల్లో చక్కెర శాతం అధికంగా ఉంటుంది. పైగా, పండ్లను రసం చేసేటప్పుడు వాటిలో ఉండే ఫైబర్ పోతుంది. ఫైబర్ లేకపోతే, జ్యూస్ తాగిన వెంటనే రక్తంలో చక్కెర పెరుగుతుంది. దీని బదులు తాజా పండ్లు తినడం మంచిది.ఆరోగ్యంగా అనిపించే ప్రతి అల్పాహారం నిజంగా మంచిదే అని అనుకోవద్దు. పోషకాలు సమతుల్యంగా ఉండేలా, జీర్ణశక్తికి అనుకూలంగా ఉండేలా అల్పాహారాన్ని ఎంచుకోవాలి. ఉదయం మీరు ఏమి తింటే అది మీ ఆరోగ్యాన్ని నిర్ధారిస్తుంది. కాబట్టి, జాగ్రత్తగా ఆలోచించి తినండి.



# స్పోర్ట్స్ న్యూస్

# ప్రైవేట్ జెట్‌లో క్రికెట్ ఆడిన సచిన్..



ఆటకు వీడ్కోలు పలికినప్పటికీ.. క్రికెట్‌పై తనకున్న ప్రేమ ఏమాత్రం తగ్గలేదని సచిన్ టెండూల్కర్ మరోసారి నిరూపించాడు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రైవేట్ జెట్‌లో ప్రయాణిస్తూ క్రికెట్ ఆడాడు. ఈ సరదా వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. 'ఎంత ఎత్తులో ఉన్నా.. నా ఆటిట్యూడ్ మాత్రం మారదు' అంటూ వీడియోకు క్యాప్షన్ ఇచ్చాడు. ఇది క్షణాల్లోనే నెట్టింట వైరల్‌గా మారింది.కోడలు సానియా చందోక్ బౌలింగ్ చేయగా.. సచిన్ బ్యాటింగ్ చేశాడు. కూతురు సారా ఫీల్డింగ్ చేస్తూ సందడి చేసింది. ఈ సందర్భంగా ఒక బంతిని క్యాచ్ పట్టుకుని సరదాగా ఔట్ కోసం సారా అప్పీల్ చేసింది. దీనిపై వెంటనే స్పందించిన సచిన్.. 'నన్ను నువ్వెప్పటికీ ఔట్ చేయలేవు..' అని నవ్వుతూ చెప్పాడు. అంతటితో ఆగని సచిన్.. బ్యాట్‌ను తలకిందులుగా పట్టుకుని ఆడుతూ.. 'ఇలా నేను బ్యాటింగ్ చేస్తే మాత్రమే నన్ను ఔట్ చేసేందుకు అవకాశం ఉంటుంది' అంటూ సరదాగా సారాను ఆటపట్టించాడు. అయితే కొద్దిసేపటికే సారాకు క్యాచ్ అవకాశం వచ్చినా అది చేజారిపోయింది. కానీ వెంటనే వచ్చిన మరో అవకాశాన్ని మాత్రం ఆమె అందిపుచ్చుకుని సచిన్‌ను ఔట్ చేసింది. దీంతో 'యే!' అంటూ సారా సంబరాలు చేసుకోగా, సచిన్ కూడా ఓటమిని అంగీకరిస్తూ నవ్వేశాడు.ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. క్రికెట్‌కు దూరమైనా ఆట ఇంకా తన జీవితంలో భాగమేనని సచిన్ మరోసారి చాటాడంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. కుటుంబంతో కలిసి గడిపిన ఈ సరదా క్షణాలు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

# అంతర్జాతీయ క్రికెట్‌కు కేన్ విలియమ్సన్ వీడ్కోలు

న్యూజిలాండ్ క్రికెట్ దిగ్గజం కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా రిటైర్‌మెంట్ పోస్ట్ చేశాడు. దాదాపు రెండు దశాబ్దాల పాటు కివీస్ జట్టుకు సేవలందించిన ఈ స్టార్ బ్యాటర్.. తన రిటైర్‌మెంట్ నిర్ణయాన్ని ఆకస్మికంగా ప్రకటించి అభిమానులను ఆశ్చర్యానికి గురి చేశాడు. 35 ఏళ్ల విలియమ్సన్ తీసుకున్న ఈ అనూహ్య నిర్ణయం తక్షణమే అమల్లోకి రానుంది. దీంతో ప్రస్తుతం ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో కూడా అతడు ఇకపై కనిపించే అవకాశం లేదు. మిగిలిన మ్యాచ్‌ల కోసం అతడి స్థానంలో కివీస్ మేనేజ్‌మెంట్ కొత్త ఆటగాడిని త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది.రిటైర్‌మెంట్ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో విలియమ్సన్ భావోద్వేగానికి గురయ్యాడు. 'ఈ నిర్ణయం గురించి కొంతకాలంగా ఆలోచిస్తున్నాను. అయితే ఇదే సరైన సమయమని నాకు అనిపించింది. న్యూజిలాండ్ తరఫున ఆడటం నాకెప్పుడూ



గర్వకారణం. ప్రతి మ్యాచ్‌లో నా శక్తి మేరకు అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికి ప్రయత్నించాను. అంతకంటే తక్కువ స్థాయిలో కొనసాగడం సరికాదని అనిపించింది. అయితే నా రిటైర్‌మెంట్ నిర్ణయం నేనే తీసుకునే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. అలాగే న్యూజిలాండ్ జట్టు భవిష్యత్తుపై నాకు పూర్తి నమ్మకం ఉంది. ఈ జట్టులో అపారమైన ప్రతిభ ఉంది. గొప్ప విజయాలు సాధించాలనే తపన కూడా కనిపిస్తోంది. ఈ జట్టుతో నా అనుబంధం ఎప్పటికీ ప్రత్యేకంగానే ఉంటుంది. ఇన్నేళ్లు ఈ ప్రయాణంలో భాగం కావడం నా అదృష్టం' అని విలియమ్సన్ వెల్లడించాడు. 2010లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన విలియమ్సన్.. తన కెరీర్‌లో 378 మ్యాచ్‌లు ఆడి 19,346 పరుగులు సాధించాడు. 48 సెంచరీలు, 6 డబుల్ సెంచరీలతో న్యూజిలాండ్ క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఆధునిక క్రికెట్‌లో విలియమ్సన్ 'ఫ్యాబ్ ఫోర్'గా పేరుపొందిన సంగతి తెలిసిందే. తాజా నిర్ణయంతో విరాట్ కోహ్లీ, జో రూట్, స్టీవ్ స్మిత్‌లలో అన్ని అంతర్జాతీయ ఫార్మాట్లకు వీడ్కోలు పలికిన తొలి ఆటగాడిగా నిలిచాడు. కెప్టెన్‌గా కూడా విలియమ్సన్ న్యూజిలాండ్‌కు మరపురాని విజయాలు అందించాడు. 2021లో భారత జట్టును ఓడించి తొలి ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (చిఅ) టైటిల్‌ను కివీస్‌కు అందించాడు. అలాగే రెండు వన్డే ప్రపంచ కప్ ఫైనల్స్, మూడు సెమీ ఫైనల్స్‌కు జట్టును నడిపించాడు.అయితే క్రికెట్‌కు పూర్తిగా దూరమయ్యే ఆలోచన మాత్రం విలియమ్సన్‌కు లేదు. ప్రపంచవ్యాప్తంగా జరిగే టీ20 లీగ్‌లలో అతడు కొనసాగనున్నాడు. ఐపీఎల్ ఫ్రాంచైజీ లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో తన అనుబంధాన్ని మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే వ్యూహాత్మక సలహాదారుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అతడు.. భవిష్యత్తులో ఫ్రాంచైజీ నిర్వహణలో కీలక పాత్ర పోషించనున్నట్లు సమాచారం.ప్రశాంత స్వభావం, నిలకడైన బ్యాటింగ్, అద్భుతమైన నాయకత్వంతో ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న విలియమ్సన్.. న్యూజిలాండ్ క్రికెట్ చరిత్రలో అత్యంత విజయవంతమైన క్రికెటర్లలో ఒకడిగా నిలిచాడు. అతడి రిటైర్‌మెంట్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లో ఒక స్వర్ణయుగానికి తెరపడిందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# టీ20 ప్రపంచ కప్ 2026 ప్రైజ్ మనీ భారీగా పెంపు..



ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా పురుషుల క్రికెట్ మాత్రమే క్రేజ్ ఉండేది. అయితే కాలం మారి.. ప్రస్తుతం మహిళా క్రికెట్‌కు కూడా ఆదరణ, క్రేజ్ అంతకంతకూ పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో ఐసీసీ కూడా మహిళా క్రికెట్ టోర్నీలకు సంబంధించి అనేక మార్పులు తీసుకొచ్చింది. తాజాగా మహిళా టీ20 వరల్డ్ కప్ 2026 కోసం ఐసీసీ సంచలన నిర్ణయాన్ని ప్రకటించింది. ఇంగ్లండ్ వేదికగా ప్రారంభం కానున్న ఈ మెగా టోర్నమెంట్ నగదు బహుమతిని ఐసీసీ ఊహించని రేంజ్‌లో పెంచింది.ఐసీసీ మహిళా టీ20 ప్రపంచ కప్ 2026లో ఛాంపియన్‌గా నిలిచి టైటిల్ గెలుచుకునే జట్టుకు ఏకంగా 2.34 మిలియన్ డాలర్లు(భారతీయ కరెన్సీలో దాదాపు రూ.22 కోట్లు) నగదు బహుమతి లభించనుంది. అలాగే రన్నరప్‌గా నిలిచే జట్టుకు 1.17 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.11 కోట్లు) అందజేయనున్నారు. ఫైనల్ చేరిన జట్లకే కాకుండా టోర్నీలో ఆడే ప్రతి జట్టుకూ భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది ఐసీసీ. ఈ వరల్డ్ కప్‌లో పాల్గొనే మొత్తం 12 జట్లకు ఒక్కో జట్టుకు 247,500 డాలర్లు (దాదాపు రూ.2 కోట్లు) పార్టిసిపేషన్ బహుమతి కింద అందనుంది.దీనితో పాటు సెమీఫైనల్స్ వరకు వచ్చిన జట్లకు కూడా తలా రూ.6.56 కోట్ల చొప్పున భారీ నగదు దక్కనుంది. మహిళా క్రికెటర్లను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఐసీసీ ఈ తరహా సంచలన నిర్ణయాలు తీసుకుంటోంది. మరోవైపు ఈసారి జరిగే టోర్నీ ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ చరిత్రలోనే అతిపెద్ద టోర్నమెంట్‌గా నిలవనుంది. ఎందుకంటే గతంలో కంటే భిన్నంగా ఈసారి రికార్డు స్థాయిలో మొత్తం 12 జట్లు ఈ మెగా సమరంలో పోటీపడుతున్నాయి.

# ఆస్ట్రేలియన్ ఓపెన్: సెమీస్‌కు దూసుకెళ్లిన పీవీ సింధు

భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. సిడ్నీ వేదికగా జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో మూడో సీడ్ సింధు అద్భుత ప్రదర్శన చేసింది. చైనీస్ తైపీకి చెందిన చాన్ సు యు (అప్రవని ాబీ-ఎబీ)పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ సునాయాసంగా విజయాన్ని అందుకుంది.క్కువ సమయంలోనే ముగిసిన ఈ ఏకపక్ష పోరులో సింధు 21-6, 21-9 తేడాతో ప్రత్యర్థిని చిత్తు చేసింది. కోర్టు నలుమూలలా అద్భుతమైన స్మాష్‌లు, డ్రాప్ షాట్లతో చెలరేగిన ఈ భారత స్టార్, ప్రత్యర్థి కోలుకునేందుకు చిన్న అవకాశం కూడా ఇవ్వలేదు. ఈ విజయంతో సింధు టైటిల్ వేటలో మరో అడుగు ముందుకు వేసింది. శనివారం జరగబోయే హై-వోల్టేజ్ సెమీఫైనల్ మ్యాచ్‌లో జపాన్ స్టార్ క్రీడాకారిణి, టాప్ సీడ్ అకానే యమగుచితో సింధు తలపడనుంది. ఈ ప్రతిష్ఠాత్మక పోరులో గెలిచి సింధు ఫైనల్‌కు చేరాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు. ఈ సీజన్‌లో జరిగిన ఎనిమిది బీడబ్ల్యూఎఫ్ టోర్నమెంట్లలో సింధు సెమీఫైనల్‌కు చేరడం ఇది రెండోసారి మాత్రమే. ఇలాంటి క్లిష్ట సమయంలో సింధుకు ఈ విజయం ఒక శుభసూచకం. మహిళల సింగిల్స్ డ్రాలో మరో భారత యువ క్రీడాకారిణి తన్వి శర్మ కూడా సత్తాచాటుతోంది. ఆమె తన తోటి క్రీడాకారిణి మాళ్వికా బన్సోద్‌పై వరుస గేమ్‌ల్లో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది.



# వన్డే ప్రపంచ కప్ 2027: షెడ్యూల్ ఖరారు!




వన్డే ప్రపంచ కప్ 2027కి సంబంధించిన తేదీలను ఐసీసీ ఖరారు చేసినట్లు వార్తలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ మెగా టోర్నీ.. వచ్చే ఏడాది అక్టోబర్ 4న ప్రారంభం కానున్నట్లు సమాచారం. నవంబర్ 21న వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ జరగనున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2026 ఫైనల్ సమయంలో అహ్మదాబాద్‌లో జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో ఈ తేదీలపై ఏకాభిప్రాయం కుదిరినట్లు సమాచారం.టీమిండియా వెటరన్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ.. ఇప్పటికే టెస్టు, టీ20 ఫార్మాట్లకు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. కేవలం వన్డేల్లోనే కొనసాగుతున్న వీరిద్దరికీ.. 2027 వన్డే ప్రపంచ కప్ చివరి అంతర్జాతీయ టోర్నీ అయ్యే అవకాశం ఉన్నట్లు చాలాకాలంగా చర్చ నడుస్తోంది. ఈ క్రమంలో అనధికారికంగా వన్డే ప్రపంచ కప్ డేట్స్ నెట్టింట చక్కర్లు కొడుతుండటంతో.. రో-కో అంతర్జాతీయ క్రికెట్ ఆడే టైమ్‌లైన్ ఫిక్స్ అయిపోయిందనే చర్చ మొదలైంది.ప్రస్తుతం విరాట్‌కు 37 ఏళ్లు, రోహిత్‌కు 39 ఏళ్లు.. వీరిద్దరూ కేవలం వన్డే ఫార్మాట్‌కే పరిమితమవ్వడంతో మరో ఏడాదిన్నర పాటు అత్యున్నత స్థాయి ఫిట్‌నెస్, ఫామ్‌ను కొనసాగించగలరా? అనేదే ఇప్పుడున్న పెద్ద ప్రశ్న. వచ్చే వన్డే ప్రపంచ కప్ వరకూ కొనసాగాలని అనుకుంటే ఫామ్‌తో పాటు ఫిట్‌నెస్‌పైనా వీరిద్దరు దృష్టి పెట్టాలి. ఇప్పటికే కుర్రాళ్లు అద్భుత ప్రదర్శనలతో జట్టులో స్థానం కోసం పోటీపడుతున్నారు. టీమ్ మేనేజ్‌మెంట్ కూడా యువ ప్లేయర్లకు అవకాశాలు ఇవ్వడానికే మొగ్గుచూపుతోంది. ఈ క్రమంలో రో-కో ఫామ్‌లో లేకపోయినా.. ఫిట్‌గా లేకపోయినా జట్టులో స్థానం కోల్పోక తప్పదు. వన్డే ప్రపంచ కప్ కల నెరవేర్చుకోవాలంటే రో-కో తీవ్రంగా శ్రమించాల్సిందే.వన్డే ప్రపంచ కప్ 2027కు సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. మొత్తం 54 మ్యాచ్‌లు జరగనున్న ఈ టోర్నీలో 41 మ్యాచ్‌లకు దక్షిణాఫ్రికా వేదిక కానుండగా.. జింబాబ్వేలో 10, నమీబియాలో 3 మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు సమాచారం. 2003 తర్వాత దక్షిణాఫ్రికాలో పురుషుల వన్డే ప్రపంచ కప్ జరగడం ఇదే తొలిసారి కావడం విశేషం. మరోవైపు 2027-2031 ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రామ్ (ఈఖఖ)లో తొలి ఐసీసీ ఈవెంట్‌గా ఈ ప్రపంచ కప్ నిలవనుంది.

# నేటి నుంచే ఐసీసీ ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్.. పాక్‌తో భారత్ పోరు.. ఎప్పుడంటే?

ఐసీసీ ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ 2026కు కౌంట్‌డౌన్ మొదలైంది. నేడు సాయంత్రం 5:30(భారత కాలమానం ప్రకారం రాత్రి 11:00) గంటలకు ఈ టోర్నీ అట్టహాసంగా ప్రారంభం కానుంది. మహిళల క్రికెట్‌కు అంతకంతకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో క్రికెట్ ప్రేమికులకు పూనకాలు తెప్పించేలా ఈ మెగా టోర్నీ సాగనుంది. పాకిస్థాన్‌తో జరిగే హైఓల్టేజ్ మ్యాచ్‌తో భారత్ తన టైటిల్ వేటను ప్రారంభించబోతోంది. జూన్ 14న జరిగే ఈ మ్యాచ్‌కు బర్మింగ్‌హామ్(ఇంగ్లండ్) ఆతిథ్యమివ్వనుంది.నేటి(శుక్రవారం) నుంచి జులై 5 వరకు ఇంగ్లండ్, వేల్స్‌లో జరగనున్న ఈ మెగా టోర్నమెంట్‌లో మొత్తం 12 జట్లు తలపడుతున్నాయి. వీటిని రెండు గ్రూపులుగా విభజించారు. ఒక్కో గ్రూప్‌లో 6 జట్లు ఉంటాయి. గ్రూప్ స్టేజ్‌లో ప్రతి టీమ్ మిగిలిన జట్లతో ఐదు మ్యాచ్‌లు ఆడుతుంది. ఆ తర్వాత రెండు గ్రూపుల నుంచి టాప్-2 లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఇక.. టీమ్‌ఇండియా విషయానికొస్తే.. భారత్ గ్రూప్ వన్‌లో ఉంది. ఇదే గ్రూప్‌లోనే బలమైన ఆస్ట్రేలియాతో పాటు పాకిస్థాన్, దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ జట్లు ఉన్నాయి.ఇటీవల వన్డే ప్రపంచ కప్‌ను గెలుచుకుని ఫుల్ జోష్‌లో ఉన్న హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని ఉమెన్ ఇన్ బ్లూ.. ఇప్పుడు పొట్టి ఫార్మాట్‌లోనూ హిస్టరీ క్రియేట్ చేయాలని చూస్తోంది. ఇప్పటివరకు భారత మహిళల జట్టు ఐదుసార్లు సెమీఫైనల్‌కు చేరినప్పటికీ.. ఒక్కసారీ పొట్టి కప్‌ను అందుకోలేకపోయారు. దీంతో ఈసారి ఎలాగైనా కప్ కొట్టి తీరాలనే కసిమీద అమ్మాయిలున్నారు.



# హీరోయిన్లను గ్లామరస్‌గా చూపడం అలవాటే

## ఇది టాలీవుడ్‌లోనే కొంచె తక్కువని చెప్పాలి

## జాన్వీకపూర్ పై ట్రోల్స్‌కు స్పందించిన నిత్యామీనన్

'పెద్ది' సినిమా విడుదలైన తర్వాత జాన్వీ కపూర్ పాత్ర చుట్టూ నెలకొన్న వివాదం ఇంకా చర్చనీయాంశం గానే కొనసాగుతోంది. సినిమాలో హీరోయిన్‌ను మరింత గ్లామరస్‌గా చూపించారంటూ సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తడంతో ఈ అంశం పెద్ద చర్చకు దారి తీసింది. పలువురు నెటిజన్లు, సినీ ప్రముఖులు దర్శకులను ప్రశ్నిస్తుండగా, మరికొందరు జాన్వీ కపూర్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. ఈ వివాదంలో ఇప్పటికే నటీమణులు ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి సహా పలువురు హీరోయిన్లు స్పందించి, హీరోయిన్‌లను విమర్శించడం కంటే దర్శకులను ప్రశ్నించాలని అభిప్రాయపడ్డారు.తాజాగా ఈ అంశంపై నటి నిత్యా మీనన్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. హీరోయిన్‌లను కేవలం గ్లామర్ కోణంలో చూపించడం ఒక్క తెలుగు సినీ పరిశ్రమకే పరిమితం కాదని, దాదాపు అన్ని చిత్ర పరిశ్రమల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోందని ఆమె అన్నారు. హీరోయిన్‌లను గ్లామర్ డాల్స్‌లా చూపించడం టాలీవుడ్‌లోనే ఎక్కువగా జరుగుతుందనడం సరైన అభిప్రాయం కాదు. ప్రతి ఇండస్ట్రీలోనూ ఇలాంటి పరిస్థితులు ఉన్నాయి. ప్రేక్షకులను ఆకర్షించడానికి గ్లామర్ అవసరమనే భావనతో కొంతమంది దర్శకులు, నిర్మాతలు వ్యవహరిస్తున్నారు. సినిమాలు మరింత కమర్షియల్ అవుతున్న కొద్దీ కొన్ని సందర్భాల్లో హద్దులు దాటే పరిస్థితులు ఏర్పడుతున్నాయని నిత్యా మీనన్ పేర్కొన్నారు. అయితే ఈ విషయంలో కేవలం దర్శకులనే తప్పుబట్టడం సరైంది కాదని కూడా ఆమె అభిప్రాయపడ్డారు. కొంతమంది హీరోయిన్లు గ్లామర్ పాత్రలను స్వీకరించడానికి సిద్ధంగా ఉంటారు. అదే కారణంగా దర్శకులు కూడా వారిని ఆ కోణంలో చూపిస్తుంటారు. ఇది పూర్తిగా ఒకవైపు జరిగే విషయం కాదు అని అన్నారు. తన వ్యక్తిగత అనుభవాన్ని కూడా నిత్యా ఈ సందర్భంగా పంచుకున్నారు. గతంలో కొందరు దర్శకులు నన్ను పూర్తిగా గ్లామర్ ఆధారిత పాత్రల కోసం సంప్రదించారు. కానీ అలాంటి పాత్రలు చేయడం నాకు ఇష్టం లేక నేను తిరస్కరించాను. దాని వల్ల కొన్ని పెద్ద సినిమాల్లో అవకాశాలు కోల్పోయినా బాధపడలేదు. స్టార్‌డమ్ కంటే నా వ్యక్తిగత విలువలు, నేను నమ్మే సిద్ధాంతాలు నాకు ముఖ్యం అని చెప్పారు. పరిస్థితులు మన అభిరుచికి విరుద్ధంగా ఉన్నప్పుడు 'నో' చెప్పగల ధైర్యం ఉండాలి. కానీ కొందరు హీరోయిన్లు టాప్ హీరోయిన్ కావాలనే లక్ష్యంతో లేదా పెద్ద హీరోల సినిమాల్లో అవకాశం కోసం ప్రాధాన్యత తక్కువగా ఉన్న పాత్రలను కూడా అంగీకరిస్తున్నారు.



# పెద్దిలో మంచి పాత్రను చేశా

## జాన్వీని ట్రోల్ చేయడం తగదన్న జగపతిబాబు




'పెద్ది' బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయి వసూళ్లతో దూసుకుపోతోంది. సినిమాలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నటుడు జగపతిబాబు తాజాగా ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ చిత్రంలో 'అప్పలసూరి' పాత్రలో నటించిన జగపతిబాబు, 'పెద్ది' తన కెరీర్‌లో ఎంతో ప్రత్యేకమైన సినిమా అని పేర్కొన్నారు. మధ్యలో ఎన్నో సినిమాలు చేసినప్పటికీ, ఈ సినిమా విడుదల కోసం ప్రత్యేకంగా ఎదురుచూశానని తెలిపారు. చిత్రం విడుదల తర్వాత ఒక ప్రముఖ దర్శకుడు తనకు ఫోన్ చేసి, 'ఇంత గొప్ప పాత్ర చేసినా మీ గురించి పెద్దగా చర్చ జరగడం లేదు. ఇదే పాత్రను మరో భాష నటుడు చేసి ఉంటే ఇప్పటికే ఎన్నో అవకాశాలు వచ్చేవని చెప్పినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇండస్ట్రీలో నటులకు లభించే గుర్తింపు గురించి కూడా జగపతిబాబు మాట్లాడారు. 'చాలా సందర్భాల్లో పరభాష నటులకు ఎక్కువ గౌరవం దక్కుతుంది. నేను ఇతర భాషల్లో పని చేసినప్పుడు కూడా అలాంటి ఆదరణను చూశాను. అయితే నాకు దానిపై ఎలాంటి అసంతృప్తి లేదు. కానీ 'పెద్ది' కోసం నేను ఎంత కష్టపడ్డానో నాకు తెలుసు' అని అన్నారు. షూటింగ్ సమయంలో తన పాత్రకు వచ్చిన స్పందనను గుర్తుచేసుకుంటూ, ప్రతి సన్నివేశం పూర్తయిన తర్వాత యూనిట్ సభ్యులు చప్పట్లు కొట్టేవారని చెప్పారు. సినిమా కోసం నా శక్తి మేరకు పనిచేశాను. అందుకే ఈ పాత్రకు మరింత గుర్తింపు రావాలని కోరుకోవడంలో తప్పేమీ లేదు. ఈ సినిమా కోసం నేను నా ప్రాణం పెట్టాను. అందుకే గుర్తింపు అడిగే హక్కు నాకు ఉంది. మిగతా సినిమాల విషయంలో నేను ఎప్పుడూ ఇలా మాట్లాడలేదు అని స్పష్టం చేశారు. ఇక 'పెద్ది'లో హీరోయిన్ జాన్వీ కపూర్ పాత్రపై సోషల్ మీడియాలో వస్తున్న విమర్శల గురించి కూడా జగపతిబాబు స్పందించారు. నటీనటులను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని ట్రోలింగ్ చేయడం సరికాదని అన్నారు.జాన్వీ కపూర్ తనకు అప్పగించిన పాత్రను దర్శకుడు చెప్పిన విధంగానే చేసింది. ఒక పాత్ర లేదా కొన్ని సన్నివేశాలు ప్రేక్షకులకు నచ్చకపోవచ్చు. కానీ దాని కోసం నటిని వ్యక్తిగతంగా విమర్శించడం సరైంది కాదు. కొన్నిసార్లు మంచి ఉద్దేశంతో చేసిన అంశాలు కూడా ప్రేక్షకుల వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు.

# రామాయణంలో భాగం కావడం అదృష్టం: కాజల్

సినీప్రియులందరి దృష్టి ప్రస్తుతం 'రామాయణ' మీదే ఉంది. బాలీవుడ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతోన్న ఈ సినిమాలో రణ్‌బీర్ కపూర్.. రాముడి పాత్రలో, సీతగా సాయి పల్లవి నటిస్తున్న సంగతి తెలిసిందే. నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. విలక్షణ నటుడు యశ్.. రావణుడిగా కనిపించనున్నారు. ఆయన సతీమణి మండోదరి పాత్రలో కాజల్ నటించనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తున్నాయి. తాజాగా ఆమె ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఓ అవార్డు వేడుకకు హాజరైన కాజల్ ఈ సినిమా గురించి మాట్లాడారు. తన కెరీర్లోనే ఇలాంటి బిగ్ ప్రాజెక్ట్ చేయడం మొదటిసారి అని అన్నారు. సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. భారీ స్థాయిలో 'రామాయణ' రానుంది. గతంతో నితేశ్ తివారీఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. 5వేల సంవత్సరాలకు పైగా కోట్లాది హృదయాలను పాలిస్తున్న ఈ ఇతిహాసాన్ని తెర పైకి తీసుకురావడానికి దశాబ్దం నుంచి అన్వేషణ ప్రారంభించాం. మా చిత్రబృందం ఈ చిత్రం కోసం విశ్రాంతి తీసుకోకుండా పనిచేస్తూనే ఉంది.

# సినిమా

# కిరణ్ అబ్బవరం హీరో, రైటర్, డైరెక్టర్ గా నూతన చిత్రం ప్రారంభం



డైనమిక్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం 'క', 'కె-ర్యాంప్' వంటి వరుస బ్లాక్‌బస్టర్ల తర్వాత అలరించారు. 'ఎస్ఆర్ కళ్యాణమండపం' సంచలన విజయంతో తన రైటింగ్ ట్యాలెంట్‌ని ఇప్పటికే చాటుకున్న కిరణ్ అబ్బవరం, ఇప్పుడు తన అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు హీరోగా, కథా రచయితగా, స్క్రీన్‌ప్లే రచయితగా, దర్శకుడిగా బాధ్యతలు చేపట్టడానికి సిద్ధమయ్యారు. ఈ చిత్రాన్ని జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మాతగా అరంగేట్రం చేస్తున్న ప్రముఖ ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్ సుధాకర్ చాగంటి నిర్మిస్తుండగా, సురేష్ ఎర్ర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రం, కిరణ్ అబ్బవరం కెరీర్‌లో ఇప్పటివరకు అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతోంది.

అనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. భారీ గంగాళం, మంటలు, పొగల మధ్య బ్యాక్ సైడ్ నుంచి కనిపిస్తున్న కిరణ్ అబ్బవరం సంప్రదాయ గ్రామీణ యువకుడి గెటప్‌లో ఆకట్టుకుంటున్నారు. గ్రామీణ వేడుకల వాతావరణాన్ని ప్రతిబింబించే ఈ పోస్టర్, ఈ చిత్రాన్ని కూడా ఒక ప్రత్యేక విందులా ఎంతో శ్రద్ధతో రూపొందిస్తున్నామనే ఫీలింగ్ కలిగిస్తోంది. "ఇన ఆబీవ ఃతినిటజీబబ ఖజీనిజీజీనివ చిజీజీశ్రీవ" అనే ట్యాగ్‌లైన్ మరింత ఆసక్తికరంగా మార్చింది.

ఈ చిత్రంతో దేవికా భట్ తెలుగు తెరకు హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. సీనియర్ నటులు శరత్ కుమార్, సాయి కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. యూత్‌ను ఆకట్టుకునే అంశాలతో పాటు కుటుంబ ప్రేక్షకులను మెప్పించే ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.

ఈ రోజు హైదరాబాద్‌లో చిత్ర బృందం, నటీనటులు హాజరైన ఒక భారీ పూజా కార్యక్రమంతో ఈ చిత్రం లాంఛనంగా ప్రారంభమైంది. ప్రారంభోత్సవం అనంతరం వెంటనే రెగ్యులర్ షూటింగ్ కూడా మొదలైంది. తొలి షెడ్యూల్‌లో ప్రధాన తారాగణం పాల్గొంటోంది.

దర్శకుడిగా తొలి ప్రయత్నంలోనే కిరణ్ అబ్బవరం పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ను సిద్ధం చేశారు. ప్రేక్షకులను అలరించే అన్ని అంశాలతో పాటు తనలోని కొత్త కోణాన్ని ఈ చిత్రంలో చూపించబోతున్నారు.

ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్ విశ్వాస్ డేనియల్ డీవోపీ వ్యవహరిస్తుండగా, వరుస విజయాలతో దూసుకెళ్తున్న భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. సుధీర్ మాచర్ల ప్రొడక్షన్ డిజైనర్‌గా, సంతోష్ నాయుడు ఎడిటర్‌గా పని చేస్తున్నారు.

ఈ చిత్రం షూటింగ్ ప్రారంభం కాకముందే ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. వరుస విజయాలతో జోరుమీదున్న కిరణ్ అబ్బవరం, తొలిసారి మెగాఫోన్ పట్టడం, అలాగే భారీ స్థాయిలో నిర్మాణం జరగడం వల్ల ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి ఏర్పడింది.

నటీనటులు: కిరణ్ అబ్బవరం, దేవిక భట్, శరత్ కుమార్, సాయి కుమార్

# ప్రేమ డైరీలో చివరి పేజీలు' మూవీ షూటింగ్ పూర్తి

ఫీల్ గుడ్ లవ్ స్టోరీతో టాలీవుడ్ స్క్రీన్‌పైకి ఓ బ్యూటీఫుల్ మూవీ రాబోతోంది. పి.వి. అర్జున్ యాదవ్ - అదితి జంటగా, శ్రీ ప్రసన్న హనుమాన్ వెంకటేశ్వర ప్రొడక్షన్స్ బ్యానర్‌పై పి.వి. నరసింహ యాదవ్ నిర్మాణంలో, హరికృష్ణ పామంజి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫీల్ గుడ్ లవ్ స్టోరీ 'ప్రేమ డైరీలో చివరి పేజీలు'. ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని, విడుదలకు ముస్తాబవుతోంది.

ప్రముఖ ఆడియో సంస్థ మ్యాంగో మ్యూజిక్ ద్వారా ఇప్పటికే విడుదలైన ఈ చిత్రంలోని లిరికల్ సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అర్మాన్ మెరుగు అందించిన మెలోడీ ట్యూన్స్, క్యాచీ లిరిక్స్ సంగీత ప్రియులను అలరిస్తూ, సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచాయి. పాటలకు వస్తున్న ఈ అద్భుతమైన రెస్పాన్స్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది.

ఈ సినిమాతో పి.వి. అర్జున్ యాదవ్ హీరోగా గ్రాండ్‌గా పరిచయం అవుతున్నారు. సినిమాలో హీరో క్యారెక్టరైజేషన్, ఆయన నటన ప్రేక్షకులను ఎమోషనల్ జర్నీకి గురిచేస్తాయి. లవ్, ఎమోషన్స్ కలబోసిన ఈ కథలో అర్జున్ యాదవ్ తన నటనతో, పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను కట్టిపడేయనున్నాడు. మొదటి సినిమా అయినప్పటికీ ఎంతో పరిణతి ఉన్న నటుడిగా, ఒక వైపు లవర్ బాయ్‌గా.. మరోవైపు ఎమోషనల్ సీన్స్‌లో జీవించేసి చిత్రానికి మెయిన్ ఎట్రాక్షన్‌గా నిలిచాడు. ఈ సినిమాతో టాలీవుడ్‌లో ఆయనకు హీరోగా మంచి బ్రేక్ లభించడం ఖాయంగా కనిపిస్తోంది. అర్జున్ యాదవ్ సరసన హీరోయిన్‌గా అదితి నటించగా, వీరిద్దరి కెమిస్ట్రీ సినిమాకు హైలైట్‌గా నిలవనుంది.

మ్యాంగో మ్యూజిక్ ద్వారా విడుదలైన లిరికల్ సాంగ్స్ ఇప్పటికే చార్ట్‌బస్టర్స్‌గా నిలిచి సినిమా ప్రమోషన్స్‌కు భారీ మైలేజ్ తెచ్చిపెట్టాయి.



ప్రేమ, భావోద్వేగాలు, మరిచిపోలేని జ్ఞాపకాల సమాహారంగా దర్శకుడు హరికృష్ణ పామంజి ఈ చిత్రాన్ని అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో తెరకెక్కించారు. ప్రతి ఒక్కరినీ క్లైమాక్స్ వరకు కదలకుండా కూర్చోబెట్టేలా ఈ 'చివరి పేజీలు' సాగుతాయని చిత్రయూనిట్ చెబుతోంది.

తేజ అందించిన సినిమాటోగ్రఫీ ప్రతి ఫ్రేమ్‌ను ఎంతో అందంగా, రిచ్‌గా చూపించబోతోంది. హృదయాలను హత్తుకునే ఓ అందమైన ప్రేమ ప్రయాణంగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న 'ప్రేమ డైరీలో చివరి పేజీలు' సినిమా త్వరలోనే థియేటర్లలో సందడి చేయనుంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను, విడుదల తేదీని చిత్ర యూనిట్ త్వరలోనే ప్రకటించనుంది.

నటీనటులు: పి.వి. అర్జున్ యాదవ్, అదితి తదితరులు.

# పెంపుడు కుక్కను మట్టుపెట్టిన దుర్మార్గుడు

## కన్నీరు పెట్టుకున్న నటి మంజరి ఫడ్నిస్

తన అపార్ట్‌మెంట్‌లో ఉండే ఓ కుక్కను విచక్షణారహితంగా కొట్టి చంపేశారంటూ నటి మంజరి ఫడ్నిస్ ఆవేదన వ్యక్తంచేశారు. 2019లో తమ సొసైటీలో గుర్తుతెలియని వ్యక్తులు ఓ కుక్కని వదిలివెళ్లారని అప్పటినుంచి దాన్ని 'మైకీ' అని పేరుతో తామే పెంచుకుంటున్నట్లు తెలిపారు. కొన్ని రోజుల నుంచి అది కనిపించకపోవడంతో పోస్టర్లు కూడా వేసి వెతికామని.. ఈ క్రమంలో సొసైటీకి చెందిన ఓ వ్యక్తి అత్యంత కిరాతకంగా దాన్ని కొట్టి చంపేశారని ఆరోపించారు. భవిష్యత్తులో ఇలా ఎవరూ జంతుహింసకు పాల్పడకుండా కఠినమైన చట్టాలు తీసుకురావాలని మంజరి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఆమె విలపిస్తూ మాట్లాడుతున్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. భూమి పెడ్నేకర్‌తో పాటు మరికొందరు దీనిపై స్పందించారు. 2004లో ఓ హిందీ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన మంజరి అల్లరి నరేశ్‌తో కలిసి 'సిద్ధూ ఫ్రమ్ శ్రీకాకుళం', 'శుభప్రదం' చిత్రాల్లో నటించారు. అలాగే ఎన్టీఆర్ హీరోగా వచ్చిన 'శక్తి'లో గౌరిగా కనిపించారు.



Printed by Published by **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH** on behalf of **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH**, Printed at and Published at 1-7-750/1-3, F 103 and 102, ST. PIOUS SCHOOL ROAD, Sruthi Sadan Apts, Ramnagar, Hyderabad-500020, Telangana. Editor **RAGHURAMA RAJU KALIDINDI.** PRGI NUMBER TGTEL/25/A3603, CELL : 9849379430, MAIL ID: kingdailynewspaper@gmail.com